
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY భద్రాద్రి కొత్తగూడెం
BHADRADRI KOTHAGUDEM
ఆదివారం, 28 జూలై 2024
5




పునరావాస కేంద్రానికి తరలివెళ్తున్న లోతట్టు ప్రాంతాల జనం



ఏజెన్సీ అభివృద్ధిలో

అలుపెరుగని యోధుడు

ఉమ్మడి ఖమ్మం జిల్లా గిరిజన ప్రాంతాల అభివృద్ధిలో మంత్రి తుమ్మల మార్క్

ఆయనది నలభై ఏళ్ల సుదీర్ఘ రాజకీయ ప్రయాణం.. ఒడిదొడుకులు ఎన్ని ఎదురైనా ఆయన అభివృద్ధినే శ్వాసించారు.. ఉమ్మడి ఖమ్మం జిల్లా రుణం తీర్చుకోవాలని పరితపించారు.. మారుమూల గ్రామాలకు అభివృద్ధి వెలుగులు పంచారు.. ముఖ్యంగా ఏజెన్సీ గ్రామాలపై చెరగని ముద్ర వేశారు.. గిరిజనులకు ఆరాధ్య దైవంగా మారారు... వివాదాలకు అతీతంగా ప్రజల కోసం అహరహం శ్రమిస్తూ ప్రగతి బాటలు వేశారు.. ఇంకా వేస్తూనే వున్నారు.. ఆయనే మంత్రి తుమ్మల నాగేశ్వరరావు. ఉమ్మడి ఖమ్మం జిల్లా అభివృద్ధిపై చెరిగిపోని సంతకం ఆయన సొంతం. సాగునీటి రంగంతోపాటు విద్య, వైద్యం వ్యవసాయం, పారిశ్రామిక రంగాల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లాను అగ్రభాగాన నిలబెట్టడంలో మంత్రి తుమ్మల కృషి ఎంతో విలువైనది. గిరిజనుల అభ్యున్నతికి సంబంధించి నాలుగు దశాబ్దాల నాడే ఆయన కృషి జరపగా, వాటి ఫలితాలు ఇప్పుడు ఏజెన్సీలోని పల్లెపల్లెనా కనిపిస్తాయి. ఏజెన్సీ ప్రాంతాల్లో తుమ్మల పంచిన ప్రగతి వెలుగులపై ప్రత్యేక కథనం...

- రోడ్లు, విద్య, వైద్యం, సాగు, తాగునీటి సౌకర్యాల కల్పన
- వ్యవసాయం, ఉద్యాన, పామాయిల్ పంటల అభివృద్ధికి ఆద్యుడు
- విద్య, వైద్యం, పారిశ్రామిక రంగాలకూ ప్రాధాన్యం
- ఆధునిక ప్రపంచంలోకి అత్యంత మారుమూల గిరిజనులు
- దైవం ఆయన రూపంలో వచ్చిందంటున్న గిరిజనులు



అశ్వారావుపేట, జూలై 27: తన నలభై ఏళ్ల సుదీర్ఘ రాజకీయ జీవితంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల అభివృద్ధిపై చెరగని ముద్ర వేశారు. 'మనం శాశ్వతం కాదు, మనం చేసిన పనే శాశ్వతం' అని నమ్మిన తుమ్మల.... గిరిజన భాష, యాసను పుణికి పుచ్చుకుని వారితో మమేకమయ్యారు. అందుకే ఆయనంటే గిరిజనుల్లో ఆరాధ్య భావన కనిపిస్తుంది.

ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని అశ్వారావుపేట, కొత్తగూడెం, ఇల్లెందు పినపాక, భద్రాచలం ప్రాంతాలతో పాటు మైదాన ప్రాంతాల్లో అనేక మౌలిక వసతులు కల్పించారు. 1990-2000 వరకు ఏజెన్సీ ప్రాంతమైన అశ్వారావుపేటతో పాటు ఏ ప్రాంతాన్ని చూసినా కనీస సౌకర్యాలు లేని గ్రామాలే కనిపించేవి. మండల కేంద్రం నుంచి ఏ గ్రామానికి వెళ్లాలన్నా సైకిల్‌పైనో, నడిచో వెళ్లాల్సి వచ్చేది. వర్షం వస్తే కాళ్లు బురదలో కూరుకొనిపోయి నడవటానికి కూడా వీలు లేనంత దుర్భర స్థితిలో గ్రామాల్లోని రహదారులుండేవి. అలాంటి సమయంలో మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తుమ్మల నాగేశ్వరరావు... మారుమూల ఏజెన్సీ గ్రామాలన్నింటికీ బీటీ రోడ్లు, అంతర్గతంగా సీసీ రహదారులు, వంతెనలు నిర్మాణం, వ్యవసాయం అభివృద్ధి కోసం చిన్నతరహా, మధ్య తరహా ప్రాజెక్టులు, గిరిజనుల కోసం చెక్‌డ్యామ్‌లు, ఎత్తిపోతల పథకాలు, భూమి అభివృద్ధి, సీఐ వెల్స్‌ద్వారా బోరుబావులు, విద్యుత్ కనెక్షన్లు ఏర్పాటు చేసి గిరిజన ప్రాంతాల్లో వ్యవసాయం వేగంగా అభివృద్ధి చెందేలా కృషి చేశారు.

ఐటీడీఏ ద్వారా గిరిజనులకు పశువులు అందజేశారు. చదువుతోనే మార్పు సాధ్యమని గుర్తించి ప్రతి గ్రామంలో పాఠశాలలు, అంగన్‌వాడీ భవనాలను ఏర్పాటు చేసి విద్యకు అత్యంత ప్రాధాన్యతనిచ్చారు. గిరిజన ప్రాంతాల్లో ఆశ్రమ పాఠశాలలు, రెసిడెన్షియల్ పాఠశాలలు ఏర్పాటు చేసి ఎందరో గిరిజన యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించారు. వీటితో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ ఆస్పత్రులు ఏర్పాటు చేశారు. ప్రతి గ్రామానికి రక్షిత తాగునీటి పథకాలను మంజూరు చేసి పాతికేళ్ల క్రితమే ఇంటింటికీ కుళాయి వచ్చేలా చూశారు. అశ్వారావుపేట మండలంలోని పెదవాగు, వెంకమ్మ చెరువుల్లో అప్పట్లోనే ఆయన ఫ్లోరైడ్‌రహిత ప్రాజెక్టులు ఏర్పాటు చేసి 20 గ్రామాలకు నాణ్యమైన తాగునీటిని అందించారు.

వ్యవసాయంపై ప్రత్యేక శ్రద్ధ..

ఇవేకాకుండా రాష్ట్ర వ్యాప్తంగా అశ్వారావుపేటకు గుర్తింపునివ్వాలనే ఉద్దేశంతో 30 ఏళ్ల క్రితమే అశ్వారావుపేట మండల కేంద్రంలో వందలాది ఎకరాలను ప్రత్యేకంగా కేటాయించి వ్యవసాయ కళాశాల, సెరీకల్చర్, అటవీ పరిశోధన కేంద్రాలు, ఉద్యాన పరిశోధన కేంద్రం, కొబ్బరి విత్తనోత్పత్తి కేంద్రం

(మిగతా 6వ పేజీలో)


భద్రాచలం వద్ద గోదావరి ఉగ్ర రూపం

మహోగ్ర గోదావరి

- భద్రాచలం వద్ద 53.4 అడుగులకు చేరిన నీటిమట్టం
- తుది ప్రమాద హెచ్చరిక జారీ
- జల వలయంలో 34 గ్రామాలు
- బ్యాక్ వాటర్‌తో భద్రాద్రి పట్టణంలోని కాలనీల మునక
- లోతట్టు ప్రాంతాల ప్రజలు పునరావాస కేంద్రాలకు తరలింపు
- 75 ఫీట్లు వచ్చినా భద్రాద్రిలోకి వరద రాకుండా చర్యలు : మంత్రి తుమ్మల

జలదిగ్బంధంలో భద్రాద్రి ఏజెన్సీ గ్రామాలు



భద్రాచలం, జూలై 27: భద్రాచలం ఏజెన్సీ జల దిగ్బంధంలో చిక్కుకుంది. గత వారం రోజులుగా రెండో ప్రమాద హెచ్చరిక స్థాయిలో గోదావరి ఉధృతంగా ప్రవహిస్తుండగా శనివారం మూడో, తుది ప్రమాద హెచ్చరిక అయిన 53 అడుగులు దాటి ప్రవహిస్తోంది.. అలాగే 34 గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుక్కున్నాయి. భద్రాచలం-వాజేడు, భద్రాచలం-కూనవరం రహదారుల్లో పలు చోట్ల రోడ్లపై వరద నీరు ప్రవహిస్తోంది.. దీంతో భద్రాచలం నుంచి వివిధ ప్రాంతాలకు రవాణా సదుపాయం నిలిచిపోయింది.

భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం శుక్రవారం సాయంత్రం 6గంటలకు 47.5 అడుగులు ఉండగా 9 గంటలకు 48.2 అడుగులుంది. అర్ధరాత్రి 12 గంటలకు 48.9 అడుగులకు చేరుకోగా శనివారం ఉదయం 6 గంటలకు 50.9, 9 గంటలకు 51.6, 12 గంటలకు 52.1, 3 గంటలకు 52.8కి చేరుకుంది. కాగా సాయంత్రం 4.16కి గోదావరి నీటిమట్టం 53 అడుగులకు చేరుకోవడంతో తుది ప్రమాద హెచ్చరికను భద్రాచలం ఆర్డీవో దామోదర్‌రావు జారీ చేశారు. కాగా రాత్రి 11గంటలకు 53.6 అడుగుల నీటిమట్టం నమోదైంది. ఇది మరికొద్దిగా పెరిగి అనంతరం గోదావరి నీటిమట్టం నిలకడగా ఉండే అవకాశాలున్నాయని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

నీట మునిగిన కాలనీలు

భద్రాద్రి జిల్లాలో మొత్తం 139 కుటుంబాలకు చెందిన 432మందిని పునరావాస కేంద్రాలకు చేర్చారు. ఇందులో భద్రాచలం పట్టణానికి చెందిన 106కుటుంబాల నుంచి 343మందిని, చర్లలో 28 కుటుంబాల నుంచి 78మంది, దుమ్ముగూడంలో ఐదు కుటుంబాలకు చెందిన 20మందిని పునరావాస కేంద్రాలకు తరలించారు. భద్రాద్రి సరిహద్దున ఉన్న ఏపీలోని యటపాక పెద్దవాగు పొంగి పొర్లడంతో ఆ నీరు ఈ రెండు కాలనీల్లోకి ప్రవేశించడంతో ఇళ్లు నీట మునిగాయి. దీంతో రెవెన్యూ, గ్రామపంచాయతీ, పోలీసు సిబ్బంది వారిని నన్నపనేని మోహన్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి తరలించి, వారికి భోజనం ఏర్పాటు చేశారు. ఇదిలా ఉండగా వరద బాధితులకు అందుతున్న సౌకర్యాలు, భోజన ఏర్పాట్ల గురించి అధికారులను భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్ అడిగి తెలుసుకున్నారు.

అంతర్రాష్ట్ర రాకపోకలకు బ్రేక్

గోదావరి తుది ప్రమాద హెచ్చరిక దాటి ప్రవహిస్తుండటంతో అంతర్రాష్ట్ర రాకపోకలు నిలిచిపోయాయి. భద్రాచలం-కూనవరం రహదారిలో శివారు వద్ద విజయవాడ-జగదల్‌పూర్ జాతీయ రహదారిపై తాత్కాలిక కరకట్ట నిర్మాణం మరోసారి చేపట్టారు. అలాగే ఇసుక బస్తాలను వేసి వరద నీరు పట్టణంలోకి ప్రవేశించకుండా చర్యలు చేపట్టారు. అలాగే భద్రాచలం-చర్ల మార్గంలో దుమ్ముగూడెం మండలంలోని తూరుబాక, బుర్రవేముల, సున్నంబట్టి, పర్ణశాల ప్రాంతాల్లో రహదారులపైకి నీళ్లు వచ్చాయి. చర్ల మండలం కుదునూరు, పురటక్‌పాడు, బట్టిగూడెం, బత్తినపల్లి, రామచంద్రాపురం గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

వరద పరిస్థితిని పరిశీలించిన మంత్రి తుమ్మల

భద్రాచలంలో గోదావరి తుది ప్రమాద హెచ్చరికస్థాయిని దాటి ప్రవహిస్తుండటంతో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వరద పరిస్థితిని పరిశీలించారు. అలాగే భద్రాచలం, కూనవరం రహదారిలో ప్రధాన రహదారిపై ఏర్పాటు చేసిన తాత్కాలిక కరకట్టను పరిశీలించారు. అనంతరం సబ్‌కలెక్టరు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ 75 అడుగుల వరద వచ్చినా భద్రాచలం, ఇతర మండలాల్లోకి వరద నీరు రాకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. గోదావరి వరద పట్టణంలోకి రాకుండా చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. చుక్కనీరు భద్రాద్రిలోకి రాకుండాచర్యలు చేపట్టామని వర్షపు నీరు బయటకు వెళ్లేలా చర్యలు చేపట్టామని తెలిపారు. ఏడు మండలాల్లోని పునరావాస కేంద్రాలకే కాకుండా వరద ముంపునకు గురయ్యే మండలాలకు నాలుగువేల క్వింటాళ్ల బఫర్‌స్టాక్‌ను సిద్ధం చేశామని అన్నారు.

తల్లిని హత్య చేసి...


తుల్జాకుమారి


వినయ్‌కుమార్

- తానూ ఆత్మహత్య చేసుకున్న కుమారుడు
- మానసిక స్థితి సరిగా ఉండకపోవడమే కారణమని అనుమానం
- కొత్తగూడెం బూడిదగడ్డలో విషాదం

6

సీనియర్ నేత 'జక్కంపూడి'

కన్నుమూత



- తుమ్మల ముఖ్య అనుచరుడిగా గుర్తింపు
- తల్లాడ మండల అభివృద్ధికి కృషి
- నివాళులర్పించిన మంత్రి తుమ్మల

7



తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

- 20 తులాల బంగారం, రూ.6 లక్షల నగదు దోచుకెళ్లిన దుండగులు
- ఖమ్మం రోటరీనగర్‌లో కలకలం

వివరాలు : 6లో



మాట్లాడుతున్న నగర మేయర్ నీరజ

నవంబర్‌లో మహా పడిపూజ

- ఖమ్మంలో భారీ ఎత్తున నిర్వహిస్తాం
- ఏబీఏపీ రాష్ట్ర కార్యదర్శి పుల్లం రాజు

వివరాలు : 6లో

గుంభనంగా దండకారణ్యం



- నేటినుంచి మావోయిస్టు పార్టీ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు
- లేఖలతో ఉనికి చాటుకుంటున్న నక్సల్ నేతలు
- అడవులను జల్లెడ పడుతున్న పోలీసు బలగాలు
- ఈ ఏడాది ఇప్పటివరకు 151మంది మావోయిస్టులు హతం
- గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లోనూ తనిఖీలు
- బిక్కుబిక్కుమంటున్న అటవీ గ్రామాలు

చర్ల, జూలై 27: మావోయిస్టు పార్టీకి ఈ ఏడాదిలో జరిగిన నష్టం ఇప్పటివరకు ఎన్నడూ జరగలేదు. వరుసగా జరిగిన ఎన్‌కౌంటర్లలో సుమారు 151మంది మావోయిస్టులు మృతి చెందారు. అరెస్టుల కారణంగా సుమారు 80మంది జైల్లపాలయ్యారు. లొంగుబాట్లతో సుమారు 800మంది ఇంటిబాట పట్టారు. ఇలా అనేక ఘటనలు మావోయిస్టు పార్టీని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఇన్ని నిర్బంధాల నడుమ ఆదివారం (జూలై 28) నుంచి మావోయిస్టు పార్టీ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలకు సిద్ధమవుతోంది. ఇప్పటికే ఛత్తీస్‌గఢ్, ఒడిస్సా, తెలంగాణ, మావోయిస్టు నాయకులు జగన్, ఆజాద్, అరుణ లేఖల ద్వారా సంస్మరణ సభలను విజయవంతం చేయాలని, ఆపరేషన్ కగార్‌ని ఓడించడమే అమరులకు నివాళి అని పిలుపునిస్తున్నారు. కాగా మావోయిస్టులు నిర్వహించే సంస్మరణ సభలను ఎలా అయినా అడ్డుకోవాలని కేంద్ర, రాష్ట్ర బలగాలు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నాయి. ఆపరేషన్ జలశక్తి పేరుతో దండకారణ్యంలోకి చొచ్చుకు పోతున్నాయి.

సంస్మరణ సభలు

దళంలో పనిచేస్తూ అసువులు బాసిన చారుమజుందార్, కన్హయ్ చటర్జీ నాయకుల కోసం మావోయిస్టు పార్టీ ఈ వారోత్సవాలను ప్రతీ ఏటా నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా పార్టీ దిశా, నిర్దేశం సభలు, సమావేశాలు కొనసాగుతాయి. పార్టీకి జరిగిన నష్టం, నూతన ప్రణాళికలు, ఇతర వివరాల పరిశీలన.. ఇవన్నీ ప్రజల సమక్ష్యంలో చేయనున్నారు. మావోయిస్టుల కంచుకోటలోని రహస్యమైన దండకారణ్యంలో ఈ కార్యక్రమాలు జరగున్నాయి.

తీవ్ర నష్టం నడుమ...

కేంద్ర బలగాలు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటున్నారు. దాని ద్వారా అన్నల అన్వేషణ సాగిస్తున్నారు. ముఖ్యంగా సైలెన్స్ డ్రోన్, శాటిలైట్ చిత్రాలు, సెల్ సిగ్నల్ కమ్యునికేషన్ ద్వారా మవోయిస్టు పార్టీకి తీవ్రంగా నష్టం జరిగింది. బస్తర్ డివిజన్‌లోని 7 జిల్లాలతోపాటు, మహరాష్ట్ర, ఒడిస్సా, తెలంగాణ రాష్ట్రాల్లో జరిగిన సుమారు 12భారీ ఎన్‌కౌంటర్లలో సుమారు 151మంది మావోయిస్టులు మృతి చెందారు.


కూంబింగ్‌కు వెళ్తున్న పోలీసులు (ఫైల్)

వరుస ఎన్‌కౌంటర్ల కారణంగా మావోయిస్టులు స్వచ్ఛందంగా లొంగిపోయారు. స్థానికుల నుంచి కూడా ఆదరణ తగ్గిందన్న వాదన కూడా వినిపిస్తోంది. కాగా వార్షికోత్సవాలను వారికి అనుకూలంగా మార్చు కోవాలని మావోయిస్టులు ఆలోచన చేస్తున్నట్టు తెలుస్తోంది. సభలు, సమావేశాల ద్వారా ఆపరేషన్ కగార్‌ని ప్రజలకు వివరించి పార్టీకి జరిగిన నష్టాన్ని తెలియజేసి ప్రజల మద్దతుని కూడగట్టుకోవాలనేది వారి ఆలోచనగా కొంత మంది పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

గాలింపు ముమ్మరం

అమరవీరుల సంస్మరణ సభల నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. మావోయిస్టులు వారి ఉనికి చాటుకోవడం కోసం ఏదైనా విధ్వంసకర ఘటనలకు పాల్పడే అవకాశం ఉండడంతో పట్టణ, పల్లెల్లో తనిఖీలు, అడవుల్లో కూంబింగ్‌లు నిర్వహిస్తున్నారు. చర్ల, దుమ్ముగూడెం మండలాల్లో ఛత్తీస్‌గఢ్‌కి వెళ్లే రహదారులను సీఐలు రాజువర్మ, అశోక్, ఎస్ఐలు నర్సిరెడ్డి, వెంకటప్పయ్యలు ఆధీనంలోకి తీసుకున్నారు. ప్రధాన కల్వర్టులు, నూతనంగా నిర్మించిన రహదారులను బాంబ్‌స్కాడ్, డాగ్‌స్కాడ్‌లతో తనిఖీలు నిర్వహిస్తున్నారు. అనుమానితులను ప్రశ్నించి వదిలేస్తున్నారు. అలాగే వెంకటాపురం, వాజేడు మండలాలతో పాటు ఛత్తీస్‌గఢ్, ఒడిస్సా, మహారాష్ట్రల్లో కూడా పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. అనుమానితులను ప్రశ్నిస్తూ అడవులను జల్లెడ పడుతున్నారు. అలాగే వారం రోజుల పాటు సాయంత్రం వేళల్లో ఆర్టీసీ సర్వీస్‌లను నిలిపివేయనున్నారు. హిట్‌లిస్టులో ఉన్న వారిని అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. అడవుల్లో యంత్రాలను ఉంచొద్దని హెచ్చరిస్తున్నారు.



మైనింగ్‌కు జియో ట్యాగ్

- అక్రమ తవ్వకాలకు అధికారుల చెక్
- అనుమతికి భిన్నంగా తవ్వితే వెంటనే సమాచారం
- కొన్నేళ్లుగా విచ్చలవిడిగా వ్యవహరిస్తున్న లీజు దారులు
- గనులు, భూగర్భశాఖ తాజా చర్యలతో అక్రమార్కుల్లో గుబులు

ఖమ్మం, జూలై 27 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో భూగర్భ గనుల్లో అక్రమాలను నివారించేందుకు జియోఫెన్సింగ్ విధానం అమల్లోకి తేబోతున్నారు. గత ప్రభుత్వ హయాంలో కోట్లాది రూపాయల విలువైన ఇసుక, గ్రావెల్, ఇతర ఖనిజ సంపదను అక్రమంగా తవ్వి తరలించారు. ఈ క్రమంలో మైనింగ్ జియోఫెన్సింగ్ హద్దులు ఏర్పాటు చేసేందుకు క్షేత్రస్థాయిలో పనులు ప్రారంభించాలని జిల్లా భూగర్భ గనుల శాఖ అధికారులకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందాయి.

ఖమ్మం జిల్లాలో సుమారు 126 వరకు భూగర్భ లీజుల ద్వారా గ్రావెల్, గ్రానైట్, బాక్సైట్, డోలమైట్‌తో పాటు ఇసుక, మెటల్ తవ్వకాలు జరుగుతున్నాయి. అయితే ప్రభుత్వం ఇచ్చిన లీజు ప్రదేశాలు పక్కన బెట్టి ఆ అనుమతులతో ఇతర చోట్ల తవ్వకాలు జరిపి ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు. జీరో దందా నడిపిస్తున్నారు. మైనింగ్ లీజులు ప్రదేశం కాకుండా పక్క ప్రదేశాల్లో తవ్వకాలుజరిపి భూగర్భ ఖనిజ సంపదను తరలిస్తున్నారు. ఎవరైనా ఫిర్యాదు చేసినప్పుడు అధికారులు స్పందించడం, మైనింగ్ పర్యవేక్షణ జరపడం, మొక్కుబడిగా కేసులు పెట్టడం, గనుల భూగర్భ శాఖలో ఒక తంతుగా సాగుతోంది. క్షేత్రస్థాయి నుంచి పైస్థాయి వరకు అక్రమాలు జోరుగా నడుస్తున్నాయి. పెద్దఎత్తున ముడుపులు చెల్లించి గనుల యజమానులు అక్రమార్జనకు పాల్పడుతున్న ఫిర్యాదులున్నాయి.

గతంలో రఘునాథపాలెం, ఏన్కూరు, కొణిజర్ల, ముదిగొండ నేలకొండపల్లి, తిరుమలాయపాలెం, కూసుమంచి, ఖమ్మంరూరల్, ఖమ్మంఅర్బన్ తదితర మండలాల్లో అధికార పార్టీ నేతల కనుసన్నల్లో తమ పరపతి, పలుకుబడి ఉపయోగించి లీజులు పొంది పెద్దఎత్తున తవ్వకాలు జరిపారు. పచ్చని కొండలు, గుట్టలు సైతం అక్రమ తవ్వకాల్లో కనుమరుగయ్యాయి. తాత్కాలిక పర్మిట్ల పేరుతో గ్రావెల్ తవ్వకాలు జరిపి పెద్దపెద్ద గుట్టలను సైతం కరిగించారు.

జిల్లాలో ప్రస్తుతం గ్రానైట్‌తోపాటు గ్రావెల్, మెటల్, డోలమైట్, బాక్సైట్ వంటి విలువైన ఖనిజ సంపద జోరుగా సాగుతోంది. ప్రతీ ఏటా కోట్లాది రూపాయల ఆదాయం చూపుతున్నా అక్రమంగా తరలింపే అంతకంటే రెట్టింపుగా ఉంది. ఈ అక్రమ తవ్వకాలు నివారించేందుకు జియోఫెన్సింగ్ విధానాన్ని ప్రవేశపెట్టబోతున్నారు. మైనింగ్ లీజులు తీసుకునేటప్పుడు తవ్వకాలు జరుగుతున్న చోట సరిహద్దులు ఏర్పాటు చేసి దానికి జియోట్యాగ్ చేయాలి. గూగుల్ అనుసంధానంతో నిరంతరం నిఘా ఏర్పాటుకానుంది. అనుమతి ఇచ్చిన భూముల్లో కాకుండా పక్కన ఎక్కడ తవ్వకాలు జరిపినా గనులు, భూగర్భ శాఖకు జియోఫెన్సింగ్ కింద శాటిలైట్ ద్వారా అక్రమ తవ్వకాలపై సిగ్నల్స్ రానున్నాయి. దీంతో మైనింగ్ శాఖ అధికారులు అప్రమత్తమై వెంటనే తనిఖీలు చేపట్టే అవకాశం ఉంటుంది. అయితే వాస్తవానికి ప్రతి మైనింగ్‌లోనూ సీసీ కెమెరాల ఏర్పాటు, తవ్వకాలు పూర్తిచేసిన తర్వాత వాటిని పూడ్చి గ్రీనరీ ఏర్పాటు చేయడం కూడా లీజు యజమానుల బాధ్యత. కానీ జిల్లాలో ఈ తంతు ఎక్కడా సాగడంలేదు. అనుమతికి మించి లోతుగా తవ్వకాలు చేయడం, ఇష్టానుసారంగా తవ్వకాలు చేపట్టడం, అనుమతి ఇచ్చిన ప్రదేశం కాకుండా పక్క ప్రదేశంలో తవ్వకాలు చేసి విలువైన భూగర్భ సంపదను తరలిస్తున్నారు.

ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు చేపడితే ఈ అక్రమ తవ్వకాలను క్షేత్రస్థాయిలో నివారించే అవకాశం ఉంది. జిల్లాలో గ్రానైట్ క్వారీలు, గ్రావెల్ క్వారీలు, బాక్సైట్, డోలమైట్ తవ్వకాలు జరుగుతున్న చోట పెద్దపెద్ద గోతులు పెట్టడం, మైనింగ్ అనుమతులకు అనుగుణంగా తవ్వకాలు కాకుండా ఇష్టానుసారంగా తవ్వకాలు జరుపుతూ నిబంధనలు ఉల్లంఘిస్తున్నారు. జియోఫెన్సింగ్ విధానం అమల్లోకి రావడం ద్వారా అక్రమ తవ్వకాలపై నిఘా నివారణ ఉంటుందని గనులు, భూగర్భశాఖ అధికారులు చెబుతున్నారు.



మాట్లాడుతున్న ఏపీ మంత్రులు అనిత, అచ్చెన్నాయుడు, రామానాయుడు, పార్థసారథి

జగన్ నిర్వాకంతోనే
పెదవాగుకు భారీ నష్టం

- 'తెలంగాణ'తో చర్చించి శాశ్వత మరమ్మతులు
- ఏపీ నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు

అశ్వారావుపేట, జూలై 27: ఆంధ్రప్రదేశ్‌ను గత ప్రభుత్వ పాపం వెంటాడుతూనే ఉందని, పెదవాగు ప్రాజెక్టు గండిపడి 12వేల ఎకరాల్లో పంటలు, భారీ ఆస్తి నష్టానికి జగన్ ప్రభుత్వ నిర్లక్ష్యవైఖరే కారణమని ఏపీ నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. శనివారం ఏపీ పరిధిలోని వేలేరుపాడు మండలంలో గోదావరి వరదను, పెదవాగు నిర్వాసిత ప్రాంతానికి వెళుతూ ఏపీ హోమ్ మంత్రి వంగలపూడి అనిత, వ్యవసాయ శాఖామంత్రి కింజెరపు అచ్చెన్నాయుడు, నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్ధసారధి, పోలవరం, దెందులూరు ఎమ్మెల్యేలు చిర్రి బాలరాజు, చింతమనేని ప్రభాకర్ అశ్వారావుపేటలోని కెమిలాయిడ్స్ గెస్ట్ హౌస్‌లో కొద్దిసేపు ఆగారు. ఈ సందర్భంగా ఏపీ తెలంగాణకు చెందిన పలువురు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు మంత్రులకు స్వాగతం పలికారు.

ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ పెదవాగు ప్రాజెక్టు 2021లోనే గోదావరి బోర్డు స్వాధీనం చేసుకొని శాశ్వత మరమ్మత్తులకు రూ.80కోట్లు అంచనావేసి అనుమతులు ఇచ్చిందని, అయితే అప్పటి ఏపీ సీఎం జగన్ ఈ ప్రాజెక్టుకు ఒక్కపైసకేటాయించక పోవడంవల్ల నేడు ఈ భారీ నష్టానికి దారి తీసిందన్నారు. తెలంగాణ ప్రభుత్వం రూ.3.50కోట్లతో తాత్కాలిక మరమ్మతులను చేపడుతున్నట్టు ప్రకటించిందని వారు తెలిపారు.

ఏపీ ప్రభుత్వం కూడ తెలంగాణ ప్రభుత్వంతో చర్చించి ఏపీలోని రైతులకు ఏ విధంగా న్యాయం చేయాలోచర్చిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కట్రం స్వామి, మండల అధ్యక్షుడు నార్లపాటి శ్రీను, అంకోలు వెంకటేశ్వరరావు, దండు శ్రీనివాసరాజు, జీలుగుమిల్లి జనసేన నాయకుడు రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.



వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీం సభ్యులు

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

- 20 తులాల బంగారం, రూ.6 లక్షల నగదు దోచుకెళ్లిన దుండగులు
- ఖమ్మం రోటరీనగర్‌లో కలకలం

ఖమ్మం క్రైం, జూలై 27: తాళం వేసిఉన్న ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన సంఘటన శనివారం ఖమ్మం నగరంలో జరిగింది. నగరంలోని రోటరీనగర్‌లో గల సీనియర్ జర్నలిస్టు నారా సుబ్రహ్మణ్యేశ్వర రావు (ఎన్.ఎస్.రావు) ఇంట్లో ఈ ఘటన జరిగింది. సుబ్రహ్మణ్యేశ్వర రావు సొంత పని నిమిత్తం హైదరాబాద్ వెళ్లగా, శుక్రవారం ఆయన భార్య ఇంటికి తాళం వేసి మణుగూరు సమీపంలోని మల్లారంలో గల బంధువుల ఇంటికి వెళ్లింది. ఈ క్రమంలో ఇంటికి తాళం వేసి ఉన్న విషయాన్ని గుర్తించిన గుర్తుతెలియని వ్యక్తులు.. రాత్రి తాళం పగులగొట్టి బంగారం, నగదును దోచుకువెళ్లారు. శనివారం ఉదయం వచ్చిన పనిమనిషికి తాళం పగులగొట్టి కనిపించడంతో ఆమె వెంటనే సుబ్రహ్మణ్యేశ్వర రావుకు సమాచారం ఇచ్చింది. వారు వచ్చి చూడగా దాదాపు 20 తులాల బంగారు ఆభరణాలు, గాజులు, ముప్పావు కిలో వెండి, వైద్య ఖర్చులకోసం ఇంట్లో దాచిన సుమారు రూ. 6 లక్షల నగదు చోరీకి గురైనట్టు గుర్తించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు వచ్చి ఫింగర్ ప్రింట్స్ సేకరించి కేసు నమోదు చేశారు. ఇదిలావుండగా, చోరీకి పాల్పడింది ఎవరనేది మిస్టరీగా మారింది. ప్రొఫెషనల్ దొంగల పనా..? ఇతరుల పనా..? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. రాత్రి ఇంట్లోకి ప్రవేశించిన దొంగలు నింపాదిగా అన్ని గదుల్లో అణువణువూ గాలించి సొత్తు పట్టుకుపోవడం విస్తుగొలుపుతోంది. ప్రధాన రహదారి చెంతనే వున్న ఇంట్లో దొంగలు పడటంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

ఏజెన్సీ అభివృద్ధిలో అలుపెరుగని యోధుడు



మొద్దులమాడ చిన్నతరహా ప్రాజెక్టు

(5వ పేజీ తరువాయి)

వంటివి ఏర్పాటు చేశారు. పామాయిల్ తోటలను రైతులతో వేయించి పామాయిల్ తోటలకు ఆద్యుడిగా పేరొందారు. పామాయిల్‌తో, ఉద్యాన పంటలతో రైతుల దశ మారి పోతుందంటూ ఆయన ఎప్పుడూ చెబుతారు. రైతులను ఇప్పటికీ ఆ వైపు ప్రోత్సహిస్తుంటారు. డ్రిప్, ఇతర రాయితీలను కల్పించి వ్యవసాయం, ఉద్యాన పంటలకు ప్రోత్సహించారు. అశ్వారావుపేట, దమ్మపేట మండలాల్లో పామాయిల్ ఫ్యాక్టరీలను తీసుకొచ్చి ఈ ప్రాంత రైతులకు జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకువచ్చారు.

కొండలపైనుంచి కిందకు దింపి ఆదుకున్నారు..

గుగులోతు బాబురెడ్డి, గోగులపూడి



కొండరెడ్లమైన మేం ఒకప్పుడు కొండలపైనే జీవిస్తుండేవాళ్లం.. 20 ఏళ్ల క్రితం మమ్మల్ని కిందకి దింపి ఇళ్లు, పాఠశాల, అంగన్‌వాడీ సెంటర్, తాగు నీటి ట్యాంకులు, ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేశారు. భూమి ఇచ్చి ఐటీడీఏ ద్వారా అనేక పథకాలను ఇప్పించి ఆదుకున్నారు. యువతకు ఉద్యోగాలు వచ్చేలా చేశారు. కొండలపై ఉండే తమను నాగరికత జీవితాల్లోకి ఆహ్వానించి ఆదుకున్నారు.

ఏజెన్సీ రూపురేఖలు మార్చివేశారు..

నిర్మల పుల్లారావు, డీసీసీబీ డైరెక్టర్, నారాయణపురం



తుమ్మల నాగేశ్వరరావు రాజకీయ రంగప్రవేశంతోనే ఏజెన్సీ ప్రాంతం, ముఖ్యంగా అశ్వారావుపేట రూపురేఖలు పూరిగా మారిపోయాయి. రహదారులు, సాగు,తాగు నీరు, ప్రాజెక్టులు, వంతెనలు, విద్య, వైద్యం, వ్యవసాయం, ఉద్యానం, పామాయిల్ ఇలా అన్నిరంగాల్లో అభివృద్ధితో చెరగని ముద్ర వేశారు. "తుమ్మలకు ముందు, తుమ్మల వచ్చాక" అనే రీతిలో రాజకీయాలు, అభివృద్ధితో ఆయన తన ముద్ర వేశారు.

గిరిజన గ్రామాలపైన ప్రత్యేక శ్రద్ధ..

గిరిజనులన్నా, గిరిజన ప్రాంతాలన్నా మంత్రి తుమ్మలకు ప్రత్యేక అభిమానం.. వ్యవసాయమంటే ఎంత ఇష్టమో.. గిరిజన ప్రాంతాలన్నా తనకు అంతే ఇష్టమని ఆయన ఎప్పుడూ చెబుతుంటారు. కన్నాయిగూడెం అటవీ ప్రాంతంలో ఆధునిక జనజీవనానికి దూరంగా ఉండే కొండరెడ్లను జన జీవన స్రవంతిలోకి తీసుకొని రావాలనే ఉద్దేశ్యంతో వారందరిని గుట్టలపైనుంచి కిందకు దింపి ప్రత్యేకంగా ఇళ్లు నిర్మించి, వ్యవసాయ భూమి, సాగు, తాగు, రవాణా, పాఠశాలలు, వైద్య సౌకర్యాలను ఏర్పాటు చేశారు. అసలు ఉందా లేదా అనుకునే మొద్దులమాడ వంటి మారుమూల కుగ్రామానికి బీటి రోడ్డు నిర్మించి, మొద్దులమాడ ప్రాజెక్టును నిర్మించి, భూమిని అభివృద్ధి చేయించి, విద్యుత్, విద్య, గృహాలను నిర్మించిన ఘనత తుమ్మలకే దక్కుతుంది. ఇప్పుడు ఏజెన్సీలో ఏ గ్రామాన్ని చూసినా బీటీ రోడ్లే కనిపిస్తాయి.

తుమ్మల మంత్రి అయిన తరువాత ఏజెన్సీ గ్రామాలు అభివృద్ధి చెందాలంటే ఏం చేయాలో అధికారులతో సర్వే నిర్వహించి అన్ని రకాల వసతులను ఆయనే స్వయంగా ఏర్పాటు చేయించారని ఈ ప్రాంత గిరిజనులు ఇప్పటికీ చెబుతుంటారు. భగవంతుడే ఆయన రూపంలో తమ వద్దకు వచ్చాడని గిరిజనులు భావిస్తుంటారు. అందుకే ఉమ్మడి రాష్ట్రంలోనైనా, తెలంగాణ రాష్ట్రంలోనైనా అభివృద్ధి గురించి మాట్లాడాల్సి వస్తే 'తుమ్మలకు ముందు, తుమ్మల తరువాత' అంటూ గ్రామాల్లో వచ్చిన మార్పులను గురించి గిరిజనులు చర్చించుకుంటుంటారు.



అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల

వ్యవసాయ కళాశాల ఏర్పాటుతో విప్లవాత్మకమార్పులు

మొగళ్లపు చెన్నకేశవరావు, అశ్వారావుపేట



అశ్వారావుపేటలో తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక శ్రద్ధతో వ్యవసాయ కళాశాల, ఉద్యానవనం, సెరికల్చర్, అటవీ పరిశోధన కేంద్రాలు, కొబ్బరి విత్తనోత్పత్తి, పామాయిల్ ఫ్యాక్టరీలు ఏర్పాటు చేశారు. రైతులు ఆర్థికంగా ఎదిగేందుకు, వారిజీవన ప్రమాణాల్లో మార్పు తెచ్చేందుకు ఆయన చేసిన కృషి అమోఘం. అభివృద్ధిలో ఆయనకు ఆయనే సాటి.

తుమ్మల హయాం... సాగుకు స్వర్ణయుగం

కాసాని దుర్గ, ఎంపీటీసీ, అచుతాపురం



సామాన్య కుటుంబం నుంచి వచ్చిన మంత్రిగా ఎదిగిన తుమ్మల నాగేశ్వరరావు రైతుల అభివృద్ధికి ప్రతి అవకాశాన్ని ఉపయోగించారు. పామాయిల్ తోటలు వేయడం, ఫ్యాక్టరీల నిర్మాణం వంటివ చేసి రైతులు ఆర్థికంగా నిలబడేలా చేశారు. రైతులు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కంటే ఎక్కువ ఆదాయాన్ని గడించాలని, రైతును రాజుగా చేయాలనే లక్ష్యంతో ఆయన పని చేశారు. వ్యవసాయ శాఖ మంత్రిగ ఉండి రైతుల రుణాలను మాఫీ చేసిన తుమ్మల ఎల్లప్పుడు ప్రజా సంక్షేమం కోసమే పనిచేశారు తుమ్మలతోనే 'మొద్దులమాడ' ఉందని తెలిసింది

తుమ్మలతోనే 'మొద్దులమాడ' ఉందని తెలిసింది

కుర్సం దుర్గారావు, మొద్దులమాడ



మాది మండల కేంద్రానికి 50 కి.మీ. దూరంలో కొండలమధ్యలో ఉన్న గ్రామం. ఇతర గ్రామాలతో సంబంధంలేని మా గ్రామానికి కాలినడకనే వెళ్లాల్సి వచ్చేది. అలాంటి మా గ్రామం అంటే తుమ్మలకు ఎంతో ఇష్టం. కాలినడకన ఓ రోజు మొద్దుల మాడ వచ్చారు. మా కష్టాలను చేసి పక్కా గృహాలు, విద్యుత్ సౌకర్యం కల్పించారు. మొద్దులమాడ ప్రాజెక్టును నిర్మించారు. భూమిని అభివృద్ధి చేయించి సాగుకు అనుకూలంగా మార్చారు. బీటీ రోడ్లు వేశారు. మొద్దులమాడ గ్రామం రాష్ట్రం మొత్తానికి తెలిసేలా చేశారు.

తల్లిని హత్య చేసి...

- తానూ ఆత్మహత్య చేసుకున్న కుమారుడు

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, జూలై 27: మతిస్థిమితం లేని తల్లిని కిరాతకంగా కడతేర్చడమే కాకుండా, చివరకు తానూ ఆత్మహత్యకు పాల్పడ్డాడు ఓ కుమారుడు. నవమాసాలు మోసి పెంచిన తల్లిని ఇనుపరాడ్‌తో కొట్టి నిర్ధయగా బలిగొనడమే కాకుండా, వెనువెంటనే ఉరివేసుకొని ప్రాణాలు తీసుకున్నాడు. ఈ ఘటనకు పాల్పడిన కుమారుడికి కూడా మానసిక స్థితి సరిగా లేదని తెలుస్తోంది. అత్యంత విషాదకరమైన ఈ ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్లితే... కొత్తగూడెం పట్టణంలోని బూడిదగడ్డ ప్రాంతంలో పాసి తుల్జాకుమారి(55) అనే మహిళ తన కుమారుడితో కలిసి జీవిస్తోంది. ఈమె భర్త గతంలోనే మృతి చెందాడు. కుమార్తెకు వివాహమైంది. వీరి పోషణ బాధ్యతను తుల్జాకుమారి మరిది గుల్లపల్లి రవిశంకర్ చూస్తున్నారు. తుల్జాకుమారి గత పదేళ్లుగా మానసిక వ్యాధితో బాధపడుతోంది. ఇందుకు సంబంధించి వైద్య చికిత్స కూడా పొందుతోంది. ఆమె కుమారుడు వినయ్‌కుమార్ (28) పట్టణంలోని ఓ బేకరి షాపులో పనిచేసేవాడు. అయితే కొన్ని రోజులుగా వినయ్ పని మానేసి ఇంట్లోనే ఉంటున్నాడు.

కొంతకాలంగా వినయ్ మానసిక స్థితి కూడా సరిగా ఉండటం లేదని తెలిసింది. ఈ క్రమంలో శుక్రవారం అర్థరాత్రి ఇంట్లో నిద్రిస్తున్న క్రమంలో వినయ్ ఇనుపరాడ్‌తో తల్లి తలపై కొట్టడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. అనంతరం వినయ్ కూడా ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఉదయం ఇద్దరూ బయటికి ఇంకా రాకపోవడంతో బంధువులు ఇంట్లోకి వెళ్లి చూడగా తల్లి, కొడుకు విగతజీవులుగా కనిపించారు. ఈ సమాచారాన్ని పోలీసులకు తెలుపడంతో సంఘటన స్థలానికి కొత్తగూడెం డీఎస్పీ షేక్ అబ్దుల్ రెహమాన్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శివప్రసాద్ తమ సిబ్బందితో చేరుకున్నారు. సంఘటన జరిగిన గదిని, మృతదేహాలను పరిశీలించిన అనంతరం క్లూస్ టీమ్‌కు సమాచారాన్ని అందజేసి ఆధారాలను సేకరించారు. ప్రతి ఒక్కరితో ఎంతో మర్యాదగా మాట్లాడే వినయ్.. తల్లిని హత్య చేసి ఆత్మహత్యకు పాల్పడ్డాడని తెలిసి స్థానికులు నివ్వెరపోయారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కొత్తగూడెం సర్వజన ప్రభుత్వ ఆసుపత్రి మార్చ్యూరీకి తరలించారు. మృతురాలి కుమార్తె హారతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు. ఇదిలావుండగా, వినయ్ ఈ ఘటనకు ఎందుకు పాల్పడ్డాడో తెలియడం లేదు. తల్లితో పాటు తనకు మానసిక స్థితి సరిగా ఉండకపోవడం కూడా ఈ ఘటనకు కారణమై ఉండవచ్చని చెబుతున్నారు. ఒంటరితనం, ఒత్తిడితో వినయ్ ఈ చర్యకు పాల్పడి వుంటాడని భావిస్తున్నారు. ఇద్దరి మృతదేహాలను చూసి బంధువులు, స్థానికులు కన్నీరు మున్నీరుగా విలపించారు.



సంఘటన స్థలంలో పరిశీలిస్తున్న కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్

విధి నిర్వహణలో గుండెపోటు

- చంద్రుగొండ ఏఎస్ఐ శ్రీనివాసరావు మృతి

చంద్రుగొండ, జూలై 27: చంద్రుగొండ పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న ఉగ్గం శ్రీనివాసరావు శుక్రవారం అర్థరాత్రి మృతి చెందారు. చంద్రుగొండ ఎస్ఐ జి.స్వప్న తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శుక్రవారం అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మండల పర్యటన సందర్భంగా ఏఎస్ఐ బందోబస్తు విధుల్లో పాల్గొన్నారు. ఈ సమయంలో కొంత అనారోగ్యానికి గురికావటంతో సహచర సిబ్బంది స్థానికంగా ప్రథమ చికిత్స చేయించారు. అనంతరం కల్లూరులో నివాసం ఉంటున్న ఏఎస్ఐ కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి కల్లూరు పంపించారు. కాగా వైద్యం కొరకు కుటుంబ సభ్యులు ఖమ్మం తరలిస్తుండగా మార్గమధ్యలో తీవ్ర గుండెపోటు రావటంతో ఏఎస్ఐ శ్రీనివాసరావు మృతిచెందారు. మృతుడు శ్రీనివాసరావుకు భార్య జయకుమారి, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

నవంబరులో మహా పడిపూజ

- ఖమ్మంలో భారీ ఎత్తున నిర్వహిస్తాం
- ఏబీఏపీ రాష్ట్ర కార్యదర్శి పుల్లం రాజు

ఖమ్మం కార్పొరేషన్, జూలై 27: నవంబర్‌లో ఖమ్మంలో అయ్యప్పస్వామి మహాపడిపూజ నిర్వహిస్తున్నట్టు అఖిల భారతీయ అయ్యప్పధర్మ ప్రచారసభ (ఏబీఏపీ) తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి పుల్లంరాజు పేర్కొన్నారు. శనివారం ఖమ్మంలోని ఒక ప్రైవేట్ ఫంక్షన్‌హాల్లో ఏబీఏపీ తెలంగాణ రాష్ట్ర జనరల్‌బాడీ సమావేశం నిర్వహించారు. నగర మేయర్ పునుకొల్లు నీరజ జ్యోతి ప్రజ్వలనం చేసి, అనంతరం అయ్యప్పస్వామి పూజచేసి, సమావేశాన్ని ప్రారంభించారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి పుల్లంరాజు మాట్లాడుతూ నవంబర్‌లో శబరిమల తంత్రిస్వామి, మెయిల్‌శాంతుల ద్వారా ఖమ్మంలో మహా పడిపూజ నిర్వహిస్తామన్నారు. నగర మేయర్ పునుకొల్లు నీరజ మాట్లాడుతూ అయ్యప్ప పడిపూజకు కావలసిన సహాయ సహకారాలను నగరపాలకసంస్థ ద్వారా అందిస్తామన్నారు. ఆధ్యాత్మిక వాతావరణంలో ఏబీఏపీ సమావేశాన్ని ఖమ్మంలో నిర్వహించటం అభినందనీయమన్నారు.

సమావేశంలో పాల్గొన్న జాతీయ అధ్యక్షుడు కే.అయ్యప్పదాస్ మాట్లాడుతూ శబరిమలకు వెళ్లే భక్తులకు సహాయార్థం అఖిల భారతీయ అయ్యప్పధర్మ ప్రచార సభ (ఏబీఏపీ) ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాలు చేపట్టనున్నట్టు పేర్కొన్నారు. కేరళ రాష్ట్రంలోని ఎరిమెలి నుంచి పంబకు వెళ్లేదారిలో శివంకు సమీపంలోని నారాయణతోడు ప్రాంతంలో అన్నదాన మందిరం నిర్మించి, శబరిమల ఆలయం తెరిచిన ప్రతిరోజు ఇక్కడ అన్నదానం నిర్వహిస్తామన్నారు. దీంతో పాటు 18అడుగుల అయ్యప్పస్వామి విగ్రహం ప్రతిష్ఠించి, నిత్యం ఇక్కడ మేల్‌శాంతి ద్వారా పూజా క్రతువులు నిర్వహిస్తామని అయ్యప్పదాస్ సమావేశంలో పేర్కొన్నారు.

ఏబీఏపీ రాష్ట్ర నూతన కార్యవర్గం

రాష్ట్ర జనరల్ బాడీ సమావేశంలో ఏబీఏపీ రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా పుల్లంరాజు, కార్యదర్శిగా కర్క సిద్ధు, కోశాధికారిగా మండా శ్రీనివాస్‌తో పాటు 21 మంది సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా కే.అయ్యప్పదాస్ (కేరళ) పరిశీలకుడిగా సీ మనోహర్ (తమిళనాడు) వ్యవహరించారు. ఈ సమావేశంలో ఇప్పటి వరకు అధ్యక్షుడిగా పనిచేసిన బేతి తిరుమలరావు గడిచిన రెండు సంవత్సరాలుగా తనకు సహకరించిన కార్యవర్గసభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.



కరకట్ట పరిధిని చూపుతున్న మంత్రి



కలెక్టర్, ఎస్పీలకు దిశానిర్దేశం చేస్తున్న తుమ్మల



భద్రాచలంలో నూతనంగా నిర్మిస్తున్న కరకట్ట ప్రదేశాన్ని సందర్శించిన మంత్రి

క్షేత్ర పర్యటనలో మంత్రి తుమ్మల

తాలిపేరుకు మళ్లీ వరద

▸ 25గేట్లు ఎత్తివేత ▸ లక్షా 22వేల క్యూసెక్కుల నీరు విడుదల



ప్రాజెక్టు నుంచి నీటి విడుదల దృశ్యం

చర్ల, జూలై 27: ఛత్తీస్‌గఢ్‌తో పాటు, చర్ల మండలంలో రెండు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో మండలంలోని తాలిపేరు ప్రాజెక్టుకు వరద నీరు పోటెత్తుతోంది. దీంతో అప్రమత్తమైన అధికారులు శనివారం ప్రాజెక్టు 25 గేట్లను పూర్తిగా ఎత్తివేసి, లక్ష 22వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. భారీ వర్షాలకు చర్ల మండలంతో పాటు సరిహద్దునున్న ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్, సుకుమా జిల్లాల్లోని చింతవాగు, చర్ల మండలంలోని రోటింత వాగు, జెర్రిపోతుల, తరివాగు, ఈతవాగులు వాగులు పొంగి పొర్లుతున్నాయి. దీంతో తాలిపేరు ప్రాజెక్టులోకి గంట గంటకూ వరదనీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్ట వద్ద డీఈ తిరుపతి పరిస్థితిని సమీక్షిస్తున్నారు. ప్రాజెక్టు ప్రస్తుత నీటి మట్టం 72.18 మీటర్లు కాగా, ఇన్‌ఫ్లో లక్షా26 వేల క్యూసెక్కులుగా ఉంది...

పోటెత్తిన గోదావరి..



బూర్గంపాడు-సారపాక రహదారిపై చేరిన వరద నీరు

▸ పొంగిన వాగులు..వంకలు ▸ నీట మునిగిన గ్రామాలు, పంట పొలాలు

▸ స్తంభించిన రాకపోకలు ▸ సురక్షిత ప్రాంతాలకు పలువురి తరలింపు

మణుగూరు, జూలై 27: గోదావరి నది ప్రవాహాలు జిల్లా వ్యాప్తంగా పెరిగాయి. భద్రాచలం, చర్ల, దుమ్ముగూడెం, పినపాక, మణుగూరు, అశ్వాపురం, మండలాల పరిధిలోని గోదావరి పరివాహక ప్రాంతాల్లోకి వరద నీరు చేరుకుంది. శనివారం గోదావరి నది నీటి మట్టం 52 అడుగులకు చేరుకునే సరికి, ఈ ప్రాంతాల్లో తోతట్టు పోలాలు జనావాసాల్లోకి గోదావరి వరద నీరు చేరుకుంటుంది. ఈక్రమంలోనే పలు గ్రామాల మధ్య ఉన్న పంట పోలాలు గోదావరి నీటి ప్రవాహాలకు పోటెత్తి ముంపనకు గురయ్యాయి. పలు ప్రధాన రోడ్లపైకి నీరు చేరడంతో రాకపోకలు నిషేధించారు. నీట మునిగిన పలు ప్రాంతాలను అధికారులు ప రిశీలించారు. ఇళ్లలోకి వరద నీరు చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వరద నీటితో ఇళ్లలోని వస్తువులు అన్ని తడిచి ముద్దయ్యాయి. దీంతో పలువురు తమ వ స్తువులను ఇతర ప్రాంతాలకు తరలించారు. అధికారులు ప లువురిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. గోదావరి వర ద ప్రవాహం గంటగంటకూ పెరుగుతుండడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ప్రజలను అప్రమత్తం చేస్తూ వరదలు పెరిగే అవకాశం ఉన్నందున సహాయక చర్యలపై తగిన ఏర్పాట్లు చేసే పనుల్లో నిమగ్నమయ్యారు. మణుగూరులో డివిజన్‌లో పినపాకలో చింతబయ్యారం శివారు ప్రాంతాలు, మణుగూరులోని కొండాయిగూడెం, రామానుజారం, మణుగూరులోని కమలాపురం, చిన్నరావిగూడెం అనంతారం గ్రామాల మధ్య ఉన్న పంట పోలాలు గోదావరి నీటి ప్రవాహాలకు పోటెత్తి ముంపునకు గురయ్యాయి.

అశ్వాపురం మండల శివారు గోదావరి ఒడ్డు సమీపంలో గల బట్టీల గుంపు గ్రామానికి వరద నీరు చేరింది. పలు ప్రధాన రోడ్లపైకి నీరు చేరడంతో రాకపోకలు నిషేధించారు. మణుగూరులో సీఐ సతీస్‌కుమార్, మండల రెవెన్యూ అధికారి రాఘవరెడ్డి సిబ్బంది కమలాపురం, చిన్న రావిగూడెం గ్రామాలను గోదావరి ఒడ్డు ప్రాంతాలను పరిశీలించారు.



పర్ణశాల స్నానఘట్టాల వద్ద వరద ఉధ్రుతి

బూర్గంపాడుకి మూడు వైపుల వరద నీరు



బూర్గంపాడు-ఏపీ వైపు వెళ్లే రహదారిపై చేరిన వరద నీరు

బూర్గంపాడు, జూలై 27: మండల కేంద్రమైన బూర్గంపాడుకి మూడు వైపుల గోదావరి వరద నీరు వచ్చి చేరింది. బూర్గంపాడు-నాగినేనిప్రోలు, నాగినేనిప్రోలు-సారపాక, బూర్గంపాడు- సోంపల్లి, ఇరవెండి నుంచి అశ్వాపురం మండల పరిధిలోని రామచంద్రాపురం గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారుల పైకి నీరు చేరడంతో రాకపోకలు నిలిపోయాయి. బూర్గంపాడు నుంచి భద్రాచలం వైపునకు వెళ్లే వాహనాలను సంజీవరెడ్డిపాలెం, మోరంపల్లిబంర, లక్ష్మీపురం గ్రామాల మీదుగా సారపాక వైపునకు మళ్లించారు. బూర్గంపాడు కొల్లు చెరువు వద్ద గోదావరి వరద నీరు ప్రధాన రహదారిపైకి చేరడంతో బూర్గంపాడు నుంచి ఏపీ వైపునకు రాకపోకలను పూర్తిగా నిలిపివేశారు. మండలం మీదుగా ప్రవహిస్తున్న కిన్నెరసాని వాగు బూర్గంపాడుకు ఉత్తరం వైపు ఉన్న ఏపీ సరిహద్దు ఏలేరు గ్రామ సమీపంలో గోదావరి నదిలో కలుస్తోంది. కిన్నెరసాని నుంచి వెళ్లే ప్రవాహనికి గోదావరి వరద అడ్డుగా ఉండడంతో అక్కడ ఎగపోటుగా ఏర్పడింది. లోతట్టు ప్రాంతాలను తహసీల్దార్ ముజాహిద్, పాల్వంచ సీఐ వినయ్‌కుమార్, ఎస్ఐలు రాజేష్, నాగభిక్షం, ఎంపీడీవో జమలారెడ్డి, ఎంపీవో సునీల్ సందర్శించి స్థానికులను అప్రమత్తం చేశారు. మండల పరిధిలో ఐదు పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేయగా, బూర్గంపాడులో 3కుటుంబాలు, నాగినేనిప్రోలు గ్రామంలో రెండు కుటుంబాలను పునరావాస కేంద్రాలకు తరలించినట్లు తహసీల్దార్ తెలిపారు.

జలదిగ్బంధంలో చర్ల



సుబ్బంపేట వద్ద అడ్డంగా పడిన చెట్టు

చర్ల, జూలై 27: గత రెండు రోజులుగా చర్ల మండలంలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఏక దాటిగా కురుస్తున్న వర్షాలకు చర్ల మండలం జలదిగ్బంలో చిక్కుకుంది. గోదావరి వరద రోడ్లపైకి చేరడంతో భద్రాచలం, వెంకటాపురం, చర్ల మండలాలకు రాక పోకలు నిలిచిపోయాయి. చర్ల మండలంలో కురిసిన వర్షాలకు మండలంలోని అటవీప్రాంతల్లో ఉన్న వాగులు పొంగి పొర్లు తున్నాయి. రాంచంద్రాపురం, బట్టిగూడెం, కొర్కట్‌పాడు, బత్తినిపల్లి గ్రామాలకు రాక పోకలు నిలిచి పోయాయి. అలాగే గోదావరికి భారీగా వరదనీరు చేరడంతో ఆలుబాక వద్ద రోడ్ నీట మునిగింది. రాక పోకలు పూర్తిగా నిలిచి పోయాయి. సుబ్బంపేట వద్ద రహదారిపై భారీ చెట్టుకూలడంతో ఎదురు గుట్టల వరకు రాక పోకలు నిలిచిపోయాయి. అలాగే బారీగా కురుస్తున్న వర్షాలకు చర్ల మండలంలోని వీధులు జలమయం అయ్యాయి. అలాగే గోదావరి పెరుగుతుండడంతో దండు పేటలోని 24 కుటుబాలను అధికారులు శనివారం కాళీచేయించి సురక్షిత ప్రాంతాలకు తరలించారు.

అశ్వాపురంలో ఎడతెరిపిలేని వర్షం..



బట్టమల్లయ్య గుంపు వద్ద రహదారిపైకి చేరిన గోదావరి వరద నీరు

అశ్వాపురం, జూలై 27: అశ్వాపురం మండలంలో ఎడతెరిపి లేకుండా కురుస్తోన్న వర్షాలకు వాగులు, వంకలు, గోదావరి నదీ ఉధ్రుతంగా ప్రవహిస్తుండడంతో పలు గ్రామాలకు రాకపోకలు అంతరాయమేర్పడింది. పలు గ్రామాల్లో పంట పొలాలు నీట మునిగాయి. మొండికుంట నుంచి నెల్లిపాక మీదుగా సారపాకకు వెళ్లే రహదారి పైకి గోదావరి వరద నీరు చేరడంతో రాకపోకలను నిలిపివేశారు. గోదావరి పరివాహక ప్రాంత పొలాలతో పాటు అమెర్ధ గ్రామంలో పత్తి చేలు నీట మునిగాయి. ఎడతెరిపి లేని వర్షంతో రహదారులు చిత్తడిగా మారి బురదమయమై రాకపోకలకు ఆటంకమేర్పరిచాయి.



నీట మునిగిన పంట పొలాలు

దుమ్ముగూడెంలో ...

దుమ్ముగూడెం, జూలై 27: గోదావరి వరద ఉధ్రుతి పెరగడంతో మండలంలోని పలు ప్రాంతాల్లో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. భద్రాచలం-చర్ల ప్రధాన రహదారిపై తూరుబాక వంతెన, బుర్రవేముల వద్ద వరదనీరు చేరింది. అలాగేసున్నంబట్టి-బైరాగులపాడు, పర్ణశాల విద్యుత్ సబ్-స్టేషన్‌ల వద్ద ప్రధాన రహదారిపైకి వరద చేరడంతో ఆయా గ్రామాలకు రాకపోకలకు ఇబ్బందులు తలెత్తాయి. రోజుల తరబడి పర్ణశాల నారచీరల ప్రాంతం ముంపులో కొనసాగుతోంది. గంగోలు డబుల్ బెడ్‌రూంల వద్దకు వరదనీరు చేరడంతో ఐదు కుటుంబాలకు చెందిన ఇరవైమంది నిర్వాసితులను స్థానిక రైతు వేదికలో పునరావాసం కల్పించారు. పర్ణశాల విద్యుత్ సబ్-స్టేషన్ పరిసరాల్లో వరదనీరు చేరడంతో ఎస్ఈ బికంసింగ్, ఏడీఈ వేణు, ఏఈలు మోహన్‌రెడ్డి, పవన్‌లు పరిశీలించారు. ఇన్‌చార్జి తహసీల్దార్ మణిధర్, ఇన్‌చార్జి ఎంపీడీవో ముత్యాలరావులు వరద పరిస్థితులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నారు.



ఇళ్లను ఖాళీ చేస్తున్న డబుల్ బెడ్‌రూం వాసులు

వరద నీటిలో కాలనీలు

భద్రాచలం, జూలై 27: గోదావరి తుది ప్రమాద హెచ్చరిక దాటి ప్రవహిస్తున్న క్రమంలో భద్రాచలం పట్టణంలోని ఏఎంసీ కాలనీ, అశోకనగర్ కొత్తకాలనీలు నీట మునిగాయి. ఈ రెండు కాలనీల్లో 94 కుటుంబాలకు చెందిన 306 మందిని భద్రాచలంలోని నన్నపనేని మోహన్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి తరలించారు. కాగా ఈ సమస్య తలెత్తడానికి ఏపీ తెలంగాణ సరిహద్దుల్లోని గోదావరి కరకట్ట స్లూయిస్‌ల నిర్వహణ లోపమే కారణమనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏపీ పరిధిలో ఉన్న స్లూయిస్‌ల లాకుల నిర్వహణను ఏపీ అధికారులు పూర్తిస్థాయిలో విస్మరించారని తెలంగాణ అధికారులు సైతం ఈ విషయంపై దృష్టిసారించకపోవడంతో తాము ముంపునకు గురయ్యామని ఆ ప్రాంతవాసులు పేర్కొంటున్నారు. ఇదిలా ఉండగా ఎంతో కీలకమైన అశోకనగర్ కొత్తకాలనీ స్లూయిస్‌ల వద్ద కేవలం 190 హెచ్‌పీ సామర్థ్యం గల మోటార్లను మాత్రమే ఏర్పాటు చేయగా అందులో రెండు మోటార్లు సాంకేతిక కారణాలతో పని చేయడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఫలితంగా ఏపీలోని యటపాక వైపు నుంచి ఉన్న వాగు ద్వారా మత్తడిపడి(అలుగు) దిగువన ఉన్న ఈ కాలనీలు గంటల వ్యవధిలోనే నడుంలోతు వరద నీరు చేరడం గమనార్హం. అధికారులు, సీపీఎం నాయకులు ఆ ప్రాంతాలకు వెళ్లి వరద బాధితులకు తమవంతు సహకారం అందించి పునరావాస కేంద్రాలకు తరలివెళ్లేలా చర్యలు చేపట్టారు.

ఇంకెన్నాళ్లు ఈ దుస్థితి

● కొప్పుల సీత, ఏఎంసీ కాలనీ



వర్షాకాలం వరదల సమయం వచ్చిందంటే ప్రతి ఏటా ఈ సమస్య తప్పడం లేదు. వరదల సమయంలో పునరావాస కేంద్రాలకు తరలించడంతో సరిపెడుతున్నారు. పూర్తిస్థాయి పరిష్కారం చూడాలి. మాకు ఇంకెనాళ్లు ఈ దుస్థితి.

అధికారులు పరిష్కారం చూపాలి

● ఉయ్యూరి హిమబిందు



చిన్న పిల్లలతో ప్రతి ఏటా వరదల సమయంలో పునరావాస కేంద్రాలకు రావాల్సి వస్తోంది. దీనికి పరిష్కారం ఉంటుందో లేదో తెలియడం లేదు. ఈసారైనా మాకు పరిష్కారం లభిస్తుందని ఆశిస్తున్నాం. అధికారులు మా సమస్యను పరిష్కరించాలి.

ఆర్టీసీ లక్కీడ్రా విజేతలకు బహుమతుల పంపిణీ



బహుమతులు ప్రదానం చేస్తున్న ఆర్ఎం సరిరాం, ఎంవీఐ శ్రీనివాసరావు

ఖమ్మంఖానాపురంహవేలి, జూలై27: ఆర్టీసీ ఖమ్మం రీజియన్ పరిధిలో జూలై 1 నుంచి 15వరకు పలు రూట్లలో డీలక్స్ బస్సుల్లో ప్రయాణించిన మహిళ ప్రయాణికులకు ఈనెల 18న లక్కీడ్రా నిర్వహించి, విజేతలను ఎంపిక చేశారు. ఎంపికైన వారికి శనివారం నగరంలోని నూతన బస్టాండ్‌లో రీజనల్ మేనేజర్ సరిరాం, మోటారు వెహికిల్ ఇన్‌స్పెక్టర్ జేఎస్ శ్రీనివాస్ బహుమతులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎంవీఐ మాట్లాడుతూ డ్రైవర్ల చేత నడపబడే ఆర్టీసీ బస్సులలో ప్రయాణికులను ఎల్లప్పుడు శ్రేయస్కరంగా ఉంటారన్నారు. మహిళ ప్రయాణికులకు మరింత చేరువయ్యే క్రమంలో మహాలక్ష్మి పథకం ఎంతో ఉపయోగపడుతుందని ఆర్ఎం సరిరాం అన్నారు. ఈకార్యక్రమంలో డిప్యూటీ ఆర్ఎం(మెయింటెన్స్) భవాని ప్రసాద్, డిప్యూటీ ఆర్ఎం (ఆపరేషన్) పవిత్ర, డిపో మేనేజర్ దినేష్‌కుమార్ పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను అమలు చేయాలి

● మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గుమ్మడి

కారేపల్లి, జూలై27: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని మాస్‌లైన్ రాష్ట్ర నాయకుడు, ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య అన్నారు. శనివారం మండల కేంద్రంలోని నిర్వహించిన ముఖ్యకార్యాకర్తల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఎన్నికల హామీలు అమలు చేయకుంటే ఆగస్టు1న తహసీల్దార్ కార్యాలయాలు, 8న కలెక్టర్ కార్యాలయం ఎదుట మాస్ లైన్ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో అనేక వాగ్దనాలు చేసిందని, అధికారంలో వచ్చి ఏడునెలలు అవుతుందన్నారు. కార్యక్రమంలో టీ.ఝాన్సీ, గుమ్మడి సందీప్, ఎన్.వి.రాకేష్, గుగులోత్ తేజనాయక్, రావుల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

భూత వైద్యుడి అరెస్టు

దుమ్ముగూడెం, జూలై 27: అనారోగ్యం లేకుండా చేస్తానని, సంతానం లేని వారికి కలిగేలా చేస్తానని, భూతాలను తరిమేస్తానని మండల ప్రజలను మోసగించిన భూత వైద్యుడిని పోలీసులు మండల మెజిస్ట్రేట్ ఎదుట శనివారం బైండోవర్ చేశారు. సీఐ అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. దమ్మపేటకు చెందిన రేపల్లె తిరుపతి అనే వ్యక్తి కొంతకాలంగా మండలంలో తిరుగుతూ పలువురి వద్ద భూతవైద్యానికి ఒక్కొక్కరి వద్ద రూ.5వేలు వసూలు చేశాడు. కొన్ని రకాల రసాయనాలు వాడి ప్రజలను మోసగించాడు. పసుపునకు వాషింగ్‌సోడా కలిపి వచ్చే ఎర్రరంగును ఆసరాగా తీసుకొని మీ ఇంట్లో భూతం ఉందని, దీని వల్ల నీకు అనారోగ్యం వస్తుందని నమ్మించి డబ్బులు వసూలు చేశాడు. సమాచారం అందుకున్న పోలీసులు అతడిని అదుపులోకి తీసుకొని ప్రశ్నించగా, చేసిన మోసాలను అంగీకరించాడు. ప్రజలు మూఢ నమ్మకాలు బలికావద్దని, ఇటువంటి వ్యక్తులు గ్రామాల్లో ఎవరైనా ఉంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సీఐ అశోక్ కోరారు.

సీనియర్ రాజకీయ నేత జక్కంపూడి కన్నుమూత

▸ తుమ్మల ముఖ్యఅనుచరుడిగా గుర్తింపు

▸ తల్లాడ మండల అభివృద్ధికి కృషి ▸ పలువురి సంతాపం



జక్కంపూడి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి తుమ్మల

తల్లాడ, జూలై 27: తల్లాడ మండలం బిల్లుపాడు గ్రామానికి చెందిన సీనియర్ రాజకీయ నేత, తల్లాడ సొసైటీ మాజీ చైర్మన్, జిల్లా కాంగ్రెస్ నాయకుడు జక్కంపూడి కృష్ణమూర్తి(72)క్యాన్సర్‌తో బాధపడుతూ శనివారం తెల్లవారుజామున మృతి చెందారు. కృష్ణమూర్తికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. 1978వ సంవత్సరం నుంచి ఆయన క్రియాశీలక రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషించారు. 1982లో తుమ్మల నాగేశ్వరరావు నాయకత్వంలో టీడీపీలో చేరి 2014వరకు ఆపార్టీలో కొనసాగారు. తుమ్మలతో పాటు 2014లో టీఆర్ఎస్, 2023లో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కృష్ణమూర్తి 32ఏళ్లపాటు టీడీపీలో సుదీర్ఘ కాలం పనిచేసి ఎన్టీఆర్, చంద్రబాబునాయుడితో సన్నిహిత సంబంధాలు కలిగి ఉన్నారు. టీడీపీ తల్లాడ మండల అధ్యక్షుడిగా, ఉమ్మడి ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షుడిగా, ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తించారు. 1981, 1991ల్లో రెండు పర్యాయాలు బిల్లుపాడు గ్రామపంచాయతీ సర్పంచ్‌గా, 1996లో తల్లాడ సొసైటీ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. కృష్ణమూర్తి భార్య ప్రేమలత 2013, 2019లో రెండు పర్యాయాలు సర్పంచ్‌గా ఎన్నికయ్యారు.

తుమ్మల సహకారంతో అభివృద్ధికి కృషి

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సహకారంతో బిల్లుపాడు గ్రామపంచాయతీతో పాటు తల్లాడ మండలంలో అంతర్గత రోడ్లు, సాగు, తాగునీరు, పాఠశాలలు వంటి మౌలిక సౌకర్యాలతో పాటు బిల్లుపాడు నుంచి పెనుబల్లి వరకు ఆర్అండ్‌బీ రోడ్డు, మాచవరం వాగుపై వంతెనలు, పైలెట్ ప్రాజెక్టు కింద తల్లాడ మండలంలోని తొమ్మిది గ్రామపంచాయతీల్లో సైడ్‌డ్రెయినేజీల నిర్మాణానికి కృష్ణమూర్తి కృషి చేశారు.

నివాళులర్పించిన మంత్రి తుమ్మల

కృష్ణమూర్తి మరణవార్త తెలుసుకున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బడ్జెట్ సమావేశాలు జరుగుతుండటంతో అసెంబ్లీ నుంచి నేరుగా బయల్దేరి బిల్లుపాడు గ్రామానికి చేరుకున్నారు. కృష్ణమూర్తి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కృష్ణమూర్తి పార్థికదేహాన్ని చూసి కన్నీళ్లపర్యంతమై తుమ్మల విలపించారు. కుటుంబసభ్యులను ఓదార్చారు. అంతిమయాత్రలో పాల్గొని కడసారి వీడ్కోలు పలికారు.

కృష్ణమూర్తికి రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యేలు కొండబాల కోటేశ్వరరావు, నల్లమోతు భాస్కర్‌రావు, తాటి వెంకటేశ్వర్లు, మెచ్చా నాగేశ్వరరావు, సండ్ర వెంకవీరయ్య, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, డాక్టర్ మట్టా దయానంద్, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాసిరెడ్డి రామనాథం, సీపీఎం రాష్ట్ర నాయకుడు పోతినేని సుదర్శన్‌రావు, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు, సొసైటీ చైర్మన్లు రెడ్డెం వీరమోహన్‌రెడ్డి, దిరిశాల నర్సింహారావు, తూము వీరభద్రరావు, తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

తక్కువ వడ్డీకే రుణాలంటూ వసూళ్లు

● గ్రామాల్లో తిరుగుతున్న ఓ సంస్థ ఏజెంట్లు

ఖమ్మం రూరల్, జూలై 27: అతి తక్కువ వడ్డీకే రూ. లక్ష రుణం అందిస్తాం, అందుకు ముందుగా రూ.6 వేలు చెల్లించిన వారికే రుణాలు అందజేస్తాం. ప్రతి నెలా వడ్డీ చెల్లించి, అసలు ఐదేళ్లలో ఎప్పుడైనా కట్టుకోవొచ్చునని చెబుతూ ఓ సంస్థకు చెందిన ఏజెంట్లు కొందరు గ్రామాల్లో తిరిగి పలువురి నుంచి కొద్ది రోజులుగా డబ్బులు కట్టించుకుంటున్న సంఘటన మండలంలోని వివిధ గ్రామాల్లో జరుగుతుంది. వివరాల్లోకి వెళితే.. ఓ సంస్థ పేరుతో కొందరు ఏజెంట్లు వివిధ గ్రామాల్లో తిరుగుతూ ప్రజలను, మధ్యతరగతి రైతులను కలిసి పెట్టుబడి తదితర అవసరాలకు ఉపయోగబడతాయని అతి తక్కువ వడ్డీకే రూ. లక్ష రుణం అందిస్తామని చెబుతున్నారు. రుణం అందించాలంటే ముందుగా రూ. 6 వేలు చెల్లించాల్సి ఉంటుంది. అలా చెల్లించిన వారికి మాత్రమే రుణం అందిస్తామని, ప్రతి నెలా వడ్డీ చెల్లించి అసలు ఐదేళ్లలో ఎప్పుడైనా చెల్లించవచ్చు అని చెబుతున్నట్లు తెలుస్తుంది. దీంతో సామాన్య ప్రజలు తక్కువ వడ్డీకే రూ.లక్ష రుణం వస్తుందని ఆశతో సంస్థ ఏజెంట్లకు రూ.6వేలు చెల్లించి ఆ సంస్థలో చేరుతున్నట్లు సమాచారం. అయితే రూ.ఆరు వేలు చెల్లించిన వారికి సంస్థ ఏజెంట్లు ఎలాంటి రశీదు ఇవ్వడం లేదు. ప్రస్తుతం డబ్బులు చెల్లించిన వారి వద్ద ఎలాంటి ఆధారం లేదు. గ్రామాల్లో తిరిగి ప్రజల వద్ద డబ్బులు కట్టించుకుంటున్న వారి వివరాలు మాత్రం తెలియరాలేదు. దీనికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

విద్యుత్ మోటార్ల దొంగల ముఠా అరెస్టు



నిందితులతో పోలీసులు

ములకలపల్లి, జూలై27: వ్యవసాయ మోటార్ల చోరీకి పాల్పడిన నలుగురు దొంగలను ములకలపల్లి పోలీసులు శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. ఎస్ఐ రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. జిన్నెలగూడెం గ్రామానికి చెందిన రైతు మిడియం గోపాలరావుకు చెందిన తోటల్లో మోటార్ల దొంగతనం జరిగిందని ఈనెల 15న రైతు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు పోలీసులు విచారణ చేపట్టారు. కంపగూడెం క్రాస్‌రోడ్ వద్ద శనివారం ఎస్ఐ తనిఖీలు నిర్వహిస్తుండగా, అనుమానాస్పదంగా ముగ్గురు వ్యక్తులు తారసపడ్డారు. వీరిని అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టగా, జిన్నెలగూడెంలో మోటార్ల చోరీకి పాల్పడినది తామేనని గడ్డం ప్రసాద్, కుంజా చందు, సాయిబాబు తెలిపారు. వీరితోపాటు మోతు శీల ఉన్నట్లు పేర్కొన్నారు. వీరు దొంగిలించిన మోటార్లను కీసర ప్రసాద్ అనే వ్యక్తికి ఒక్కొక్క మోటర్‌ను రూ.14 వేలకు అమ్మినట్లు తెలిపారు. దొంగతనానికి పాల్పడిన వీరంతా మొగరాలగుప్ప గ్రామానికి చెందిన వారిగా గుర్తించామన్నారు. వీరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

ఈఎంఐ చెల్లించాలని అడిగినందుకు దాడి

● ఓ ట్రాఫిక్ కానిస్టేబుల్ నిర్వాకం

● పోలీసులకు ఫిర్యాదు

ఖమ్మంక్రైం, జూలై27: నగరంలోని నివాసం ఉంటున్న ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఓ కానిస్టేబుల్ తన నివాసం కోసం కొంతకాలం క్రితం ఓ బ్యాంకు నుంచి రుణం తీసుకున్నాడు. కొద్ది నెలలుగా రుణం చెల్లించకపోవడంతో, సదరు కానిస్టేబుల్‌కు ఓ ప్రైవేటు బ్యాంక్ సిబ్బంది గత వారం, రోజుల నుంచి ఈఎంఐలు చెల్లించాలని ఫోన్లు చేస్తున్నారు. దీంతో శనివారం సదరు బ్యాంకు సిబ్బందిని కానిస్టేబుల్ మమతా రోడ్డులోకి రావాలని ఫోన్ ద్వారా తెలిపాడు. దీంతో అక్కడికి వెళ్లిన బ్యాంక్ సిబ్బందిపై ఈఎంఐ చెల్లించను ఏం చేసుకుంటారో చేసుకోండంటూ వారిపై దాడి చేశాడు. దీంతో బ్యాంకు సిబ్బంది సంబంధిత బ్యాంక్ అధికారులకు విషయం తెలిపినట్టు సమాచారం. అనంతరం అర్బన్ పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేశారు.

యువకుడి ఆత్మహత్య

పాల్వంచ, జూలై 27: ఇంటి నుంచి వెళ్లిన యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటనపై పాల్వంచ రూరల్ పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. చుంచుపల్లి మండలం ములుగ్గూడెం గ్రామానికి చెందిన వాడే ప్రవీణ్(22) స్థానికంగా కారు డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. గత గురువారం తాను మామయ్య ఇంటికి వెళుతున్నానని తన తల్లి రమణతో చెప్పి, బయటకు వెళ్లాడు. అప్పటి నుంచి ఇంటికి తిరిగి రాలేదు. ఈ క్రమంలో పాల్వంచ మండలం జగన్నాథపురం గ్రామంలోని పెద్దమ్మతల్లి దేవాలయం ప్రాంతంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లోని రేకుల షెడ్డులో ఉరి వేసుకుని యువకుడు మృతి చెంది ఉండటాన్ని స్థానికులు గుర్తించి, పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి ప్రవీణ్‌గా గుర్తించి, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడి తండ్రి ధర్మయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

సెల్‌టవర్ నిర్మాణం వద్దు

● 9వ వార్డు కాలనీవాసుల అభ్యంతరం

వైరా, జూలై 27: వైరా మునిసిపాలిటీ పరిధిలోని 9వ వార్డు బ్రాహ్మణపల్లి కాలనీలో సెల్‌టవర్ నిర్మాణం పట్ల అక్కడి నివాసాల వారు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఈ సెల్‌టవర్ నిర్మాణాన్ని నిలిపివేయాలని కోరుతూ మునిసిపల్ కమిషనర్ సీహెచ్.వేణుకు శనివారం ఆకాలనీవాసులు ఒక వినతిపత్రం సమర్పించారు. ఇళ్ల మధ్యలో సెల్‌టవర్ నిర్మాణం వలన ఆరోగ్య రీత్యా తాము తీవ్ర ఇబ్బందులకు గురవుతామని అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ ఏడాది ఏప్రిల్ 24న సెల్‌టవర్ నిర్మాణాన్ని నిలిపివేయాలని ఫిర్యాదు చేశామని తెలిపారు. అయితే కొద్దిరోజుల నుంచి మిన్నకుండిపోయిన కాంట్రాక్టర్, మళ్లీ సెల్‌టవర్ నిర్మించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారని వాపోయారు. టవర్ నిర్మాణాన్ని వెంటనే నిలిపివేయాలని వినతి పత్రంలో కోరారు. దీని నిర్మాణానికి ఎలాంటి అనుమతులు ఇవ్వొద్దని, ఒకవేళ అనుమతులు ఇచ్చి ఉంటే వాటిని రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. లేనిపక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో 9వ వార్డు ప్రజలు పాల్గొన్నారు.

ఆర్టీసీ లాజిస్టిక్(కార్గో) నూతన పాయింట్లు ప్రారంభం

ఖమ్మంఖానాపురంహవేలి, జూలై27: టీజీఎస్ఆర్టీసీ లాజిస్టిక్ (కార్గో) సేవల విస్తరణలో భాగంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో నూతనంగా కారేపల్లి, గుండాల, అశ్వాపురం ఏజెంట్ల పాయింట్లను శుక్రవారం ప్రారంభించామని ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాల లాజిస్టిక్ అధికారి టి.పవన్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీలో శ్రీకాకుళంలో కూడా ప్రారంభించామని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పోగొట్టుకున్న బ్యాగు అందచేత

ఖమ్మంక్రైం, జూలై27: ఓ యువతి పోగొట్టుకున్న బ్యాగును కానిస్టేబుల్ తిరిగి అప్పగించిన సంఘటన శనివారం ఖమ్మం నగరంలో జరిగింది. పాతబస్టాండ్ సమీపంలో ఓ కాలేజీ విద్యార్థిని తన బ్యాగు పోయిందని దానిలో తన చదువుకు సంబంధించిన సర్టిఫికెట్లు ఉన్నాయని డయల్100కు ఫోన్ చేసింది. దీంతో స్పందించిన వన్‌టౌన్ బ్లూకోల్ట్ కానిస్టేబుళ్లు డి.రవికుమార్, శ్రీధర్‌లు బస్టాండ్‌లోని సీసీ పుటేజీ ఆధారంగా బ్యాగును గుర్తించారు. అనంతరం ఆబ్యాగును పోలీసులు విద్యార్థినికి అందించారు.

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
భద్రాద్రి కొత్తగూడెం
కొత్తగూడెం, ఇల్లెందు, భద్రాచలం, పినపాక, అశ్వారావుపేట
8
ఆదివారం 28 జూలై 2024



పిల్లల అక్రమ రవాణపై అవగాహన సదస్సు

మణుగూరుటౌన్, జూలై 27: మణుగూరు పట్టణంలో జడ్పీ ఉన్నత పాఠశాలలో కైలాష్ సత్యార్థి చిల్డ్రన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన పిల్లల అక్రమ రవాణపై అవగాహన సదస్సులో ఎస్ఐ మేడ ప్రసాద్ పాల్గొని చిన్నారులకు అవగాహన కల్పించారు. అపరిచితులు తినడానికి ఏమైన ఇస్తే తీసుకోకూడదని, వారి మాటలు నమ్మి ఎక్కడుకు వెళ్లకూడదన్నారు. ఎవరైన అనుమాన్పదంగా పిల్లలు ఆడుకునే చోట కనిపిస్తే వెంటనే ఇంట్లో పెద్దలకు సమాచారమివ్వాలన్నారు. బడీ ఈడు పిల్లలు బడిలోనే ఉండాలని, చదువుకోవడమనేది బాలల హక్కు అన్నారు. ఎవరినైనా బడిమానిపించి పనుల్లో పెడితే వెంటనే పోలీసులకు గాని విద్యాశాఖ అధికారులకు, లేదా నమ్మదగిన వ్యక్తులకు సమాచారమివ్వాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో వీరాస్వామి, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ అనిల్, పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హక్కుల పరిరక్షణకు పోరాడాలి

ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షుడు సాబీర్ పాషా



మాట్లాడుతున్న సాబీర్ పాషా

పాల్వంచ టౌన్, జూలై 27: కార్మికవర్గ హక్కుల పరిరక్షణకై సంఘటిత, అసంఘటిత కార్మికవర్గాలు పోరాటాలకు సిద్ధం కావాలని ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షుడు, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే. సాబీర్‌పాషా పిలుపునిచ్చారు. పార్టీ కార్యాలయం సీఆర్ భవన్‌లో శనివారం జరిగిన ఏఐటీయూసీ పట్టణ 2వ మహాసభకు ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొట్లాడి సాధించిన 44 కార్మికచట్టాలను, 4లేబర్ కోడ్లుగా మార్చాలని మోదీ ప్రభుత్వం కుట్ర చేస్తుందని, దీనికి వ్యతిరేకంగా కార్మికలోకం గళం ఎత్తాలని కోరారు. ప్రభుత్వరంగ సంస్థలను కార్పోరేట్ శక్తులకు తెగనమ్మే బీజేపీ కుట్రను తిప్పికొట్టాలని కోరారు. ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి విశ్వనాథం, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జమలయ్య, ప్రసాద్, నాగేశ్వరరావు, సీపీఐ పట్టణ, మండల కార్యదర్శులు సాయిబాబు, పూర్ణ, పద్మజ, శ్రీను, వెంకటేశ్వర్లు, విశ్వేశ్వరరావు, విజయలక్ష్మి పాల్గొన్నారు.

కృత్రిమ శ్వాస అందిస్తే పునర్జన్మ: డీఎంహెచ్‌వో


కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో భాస్కర్ నాయక్



సీపీఆర్ గురించి వివరిస్తున్న వైద్య విద్యార్థులు

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, జూలై 27: కృత్రిమ శ్వాసను అందిస్తే పునర్జన్మ అందించిన వారము అవుతామని డీఎంహెచ్‌వో డాక్టర్ భాస్కర్ నాయక్ అన్నారు. శనివారం కొత్తగూడెం మెడికల్ కళాశాలలోని ఆడిటోరియంలో మాజీ రాష్ట్ర పతి డాక్టర్ ఏపీజె అబ్దుల్‌కలాం జ్ఞాపకార్థం పునర్జన్మ కార్డియో పల్మనరీ రీసాసిటేషన్ (సీపీఆర్) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ క్రమంలో ప్రభుత్వ వైద్య కళాశాల విద్యార్థులు చాతికొండ బెటాలియన్ పోలీసులకు, రేగళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బందికి అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఆర్ అనేది కృత్రిమ శ్వాసలను ఇవ్వడం, ఛాతిని నొక్కడం, తద్వారా గుండె, శరీరంలోని మిగిలిన భాగాలకు రక్తాన్ని సరఫరా చేస్తుం దన్నారు. గుండె, ఊపిరితిత్తులు ఆగిపోయిన తరువాత కూడా వ్యక్తిని సజీవంగా ఉంచడానికి సహాయ పడుతుందన్నారు. ఆకస్మికంగా గుండె పోటు వచ్చినట్లు అయితే వెంటనే సీపీఆర్ చేయాలని తెలి పారు. ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. సీపీఆర్‌పై ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కృత్రిమ శ్వాస ద్వారా పునర్జన్మను అందించవచ్చునని అన్నారు. సీపీఆర్ విధానంపై పలు చోట్ల అవగాహన కలిగిస్తున్నామని తెలిపారు. ఇందుకు సంబంధించి విద్యార్థు లు సరైన అవగాహన ఏర్పరుచుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు సీపీఆర్ చేసి చూపించారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం వైద్య కళాశాల ప్రిన్సిపాల్ కె.రాజాకుమార్, వైస్‌ప్రిన్సిపాల్ ఉమామ హేశ్వరరాజు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఎన్‌సీడి ప్రోగ్రామ్ అధికారి మధు వరుణ్, ఉలవనూరు వైద్యాధికారి తేజస్విని తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి నిధుల కేటాయింపు హర్షణీయం

మార్క్‌ఫెడ్ డైరెక్టర్, డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల


కేక్ కట్ చేస్తున్న కొత్వాల శ్రీనివాసరావు

పాల్వంచ టౌన్, జూలై 27: కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమానికి రూ.72వేల కోట్లు కేటాయించడం పట్ల మార్క్‌ఫెడ్ డైరెక్టర్, డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు హర్షం వ్యక్తం చేశారు. వార్షిక బడ్జెట్‌ను హర్షిస్తూ శనివారం పొంగులేటి క్యాంపు కార్యాలయంలో పార్టీ ఆధ్వర్యంలో కేక్‌కట్‌చేసి బాణాసంచా కాల్చి మిఠాయిలు పంచి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బడ్జెట్‌లో రైతులతోపాటు అన్ని వర్గాల వారికి ఎంతో మేలు చేకూరనుందని, ఈ బడ్జెట్ కాంగ్రెస్ ప్రజాపాలనకు నిదర్శనమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ ముత్తయ్య, పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు రంగారావు, వెంకన్న, బి.కిషోర్, రామకృష్ణారావు, భాస్కర్‌రావు, ఆచార్యులు, వెంకటాచారి, వెంకటేశ్వరరావు, నారాయణరావు, పి.మహేష్, విజయ్ పాల్గొన్నారు.

అశ్వాపురం పీఎస్‌ను సందర్శించిన డీఎస్పీ


సిబ్బందితో మాట్లాడుతున్న డీఎస్పీ రవీందర్ రెడ్డి

అశ్వాపురం, జూలై 27: అశ్వాపురం పోలీస్ స్టేషన్‌ను మణుగూరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి శనివారం ఆకస్మికంగా సందర్శించారు. స్టేసన్‌లోని రికార్డులను, రిజిస్టర్‌లను పరిశీలించారు. స్టేషన్ ఆవరణ అసాంతం పరిశీలించి స్టేషన్‌లోని గదులను పరిశీలించారు. 5S ఇంప్లిమెంటేషన్ గురించి సిబ్బందికి సూచనలు చేశారు. 100 కు డయల్ 100, విజుబుల్ పోలిసింగ్, సైబర్ నేరాలు, గంజాయి రవాణా, వినియోగం అరికట్టడం, సీసీ కెమెరాల ఏర్పాటు తదితరాలపై సిబ్బందికి తగు సూచనలు చేశారు.

సింగరేణిని కాపాడుకుంటాం: ఐఎన్‌టీయూసీ

మణుగూరుటౌన్, జూలై 27: రాష్ట్రానికి గుండెకాయలాంటి సింగరేణి సంస్థను ఎన్ని అడ్డంకులు ఎదురైనా కాపాడుకుంటామని తెలంగాణ కనీస వేతనాల సలహా మండలి ఛైర్మన్, ఐఎన్‌టీయుసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జనక్ ప్రసాద్ అన్నారు. శనివారం మణుగూరు ఏరియాలో పర్యటించిన ఆయన మణుగూరు ఓసీ గనులు, వివిధ విభాగాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆయా గనుల్లో కార్మికులు, ఉద్యోగులతో మాట్లాడారు. అనంతరం పీకేఓసీ-2 గని ఆవరణలో జరిగిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. దక్షణాది పరిశ్రమలకు అయుపట్టు, ప్రత్యక్షంగా 40 వేల మందికి, పరోక్షంగా లక్షల మంది ఉపాధిని కల్పిస్తున్న సింగరేణి సంస్థకు బొగ్గు బ్లాక్‌లను కేటాయించకుండా వేలం ద్వారా గనులను పొందాలనే ఆంక్షలను కేంద్ర ప్రభుత్వం విధిస్తోందన్నారు. ఓ వేపు సింగరేణి సంస్థను ప్రైవేటీకరించబోము అంటూనే వేలంలు నిర్వహిస్తూ రెండు నాలుకల దోరణిని కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తోందన్నారు. సంస్థ మనగడను కొనసాగించే దిశగానే రాష్ట్ర ప్రభుత్వ చర్యలు ఉంటాయని అన్నారు. ఆగస్టు నెలలోనే లాభాల బోనస్ ఇచ్చే విధంగా ఐఎన్‌టీయుసీ ప్రయత్నం చేస్తోందన్నారు. తొలిసారిగా మణుగూరు వచ్చిన ప్రసాద్‌ను కార్మికులు, నాయకులు శాలువాలు, పూల బొకేలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎస్‌సీఎంఎల్ యూనియన్ ప్రధాన కార్యదర్శి త్యాగరాజన్, ఏరియా ఉపాధ్యక్షులు వత్సవాయి కృష్ణం రాజు, కొత్తగూడెం ఏరియా ఉపాధ్యక్షులు ఎండీ రజాక్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.


జనక్ ప్రసాద్‌ను సన్మానిస్తున్న నాయకులు

ముంపు ప్రాంత నిరుద్యోగులను స్థానికులుగా గుర్తించాలి

- సీఎం రేవంత్ రెడ్డికి ఏజెన్సీ ఎమ్మెల్యేల వినతి



మణుగూరు, జూలై 27: పోలవరం ముంపు మండలాల నిరుద్యోగులను నేటికీ స్థానికేతరులుగా గుర్తిస్తున్నారని, దీంతో వారు ఉద్యోగ ఉపాధి అవకాశాలను కోల్పోతున్నారని ఏజెన్సీ ప్రాంత ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, తెల్లం వెంకట్రావ్, ఆదినారాయణ, సీతక్క, కోరం కనకయ్య శనివారం సీఎం రేవంత్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ - ఆంధ్రప్రదేశ్ విభజనకు ముందు ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పోలవరం ముంపు మండలాలైన ఏడు మండలాల్లో చదివిన నిరుద్యోగులు ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాలో ఉన్నారని అన్నారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్‌కు దరఖాస్తులు చేసే సమయంలో స్థానికేతరులుగా గుర్తిస్తున్నారని తెలిపారు. దీంతో వారు ఉద్యోగాలు పొందే అవకాశాలు లేకుండా పోతున్నాయని వాపోయారు. వీరిని స్థానికులుగా గుర్తిస్తూ జీవోను జారీ చేసి న్యాయం చేయాలని కోరారు.

బురద రోడ్డుపై నాట్లు వేసి నిరసన


నాటు వేస్తున్న మహిళలు

ఆళ్లపల్లి, జూలై 27: ప్రభుత్వాలు మారినా మా బురద రోడ్లు మాత్రం మారడం లేదని శనివారం ఆళ్లపల్లి మండల, మర్కోడు గ్రామంలో కొందరు మహిళలు బురదగా ఉన్న రోడ్లపై నాట్లు వేసి నిరసన వ్యక్తం చేశారు. మర్కోడులో ప్రధాన రోడ్డు నుంచి ఎల్లమ్మగుడికి, వ్యవసాయ పనులకు వేళ్లే దారి, ఎస్సీ కాలనీలో మరో నాలుగు అంతర్గత రోడ్లు పూర్తిగా బురదగా ఉండటంతో విద్యార్థులు, వృద్ధులు, వికలాంగులు, వ్యవసాయ కూలీలు బురదలో నడవాలి అంటే అనేక ఇబ్బందులు పడుతున్నారని, బురద రోడ్లకు తోడుగా నీరు నిలిచి దుర్గంధం వాసన, దోమలతో ఇబ్బందులు పడుతున్నామని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవలే పోసిన సీసీ రోడ్లు రాజకీయ స్వార్థం కోసం ఇండ్లు లేని చోట, నివాసాలకు దూరంగా, గ్రామ పొలిమేరల్లో సీసీ రోడ్లు వేశారని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, స్థానిక నాయకులు, అధికారులు పట్టించుకొని మర్కోడు గ్రామంలో జనాలకు ఉపయోగ పడే చోట సీసీ రోడ్లు ఏర్పాటు చేయాలని మహిళలు కోరుతున్నారు.

జాతీయస్థాయిలో రాణించేలా చూడాలి: పీవో


కబడ్డీ ఆటను పరిశీలిస్తున్న పీవో రాహుల్

పాల్వంచ రూరల్, జూలై 27: గిరిజన విద్యార్థులకు చదువుతోపాటు క్రీడల్లో శిక్షణ ఇచ్చి జాతీయస్థాయిలో రాణించే విధంగా చూడాలని భద్రాచలం ఐటీడీఎ పీవో పి. రాహుల్ కోరారు. శనివారం కిన్నెరసాని క్రీడా పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆడుతున్న క్రీడలను పరిశీలించారు. గిరిజన విద్యార్థులు కబడ్డీ, వాలీబాల్, అథ్లెటిక్స్ విభాగాల్లో తమ నైపుణ్యతను మెరుగుపర్చుకోవాలని చెప్పారు. వ్యాయామ ఉపాధ్యాయులు విద్యార్థులకు ఇష్టమైన క్రీడల్లో శిక్షణ ఇవ్వాలని తెలిపారు.

సమస్యలపై మండల సమావేశంలో నిలదీత

జూలూరుపాడు, జూలై 27: మండలంలో నెలకొన్న వివిధ సమస్యలపై ఎంపీటీసీ సభ్యులు అధికారులను నిలదీశారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ లావుడ్యా సోనీ అధ్యక్షతన మండల పరిషత్ సర్వ సభ్య సమావేశాన్ని నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాలలో మిషన్ భగీరథ సరఫరా కాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, సమస్యలు మాత్రం పట్టించుకోవడం లేదని కాకర్ల ఎంపీటీసీ పొన్నెకంటి సతీష్ అన్నారు. మద్యాన్ని ఎంఆర్‌పీకి కాకుండా అధిక ధరలకు విక్రయిస్తున్నప్పటికి వ్యాపారులపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ఎక్సైజ్ ఎస్ఐ విజేందర్‌ను ఆయన నిలదీశారు. వైన్స్ షాపుల్లో దొరకని మద్యం బెల్ట్ షాపుల్లో దొరుకుతోందన్నారు. పంచాయతీలకు బిల్లులు చెల్లించకపోవడంతో అభివృద్ధి కుంటు పడిందని, కనీసం పారిశుధ్య పనులను చేపట్టేందుకు నిధులు లేకపోవడంతో కార్యదర్శులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎంపీటీసీ సభ్యుడు తెలిపారు. బిల్లుల చెల్లింపుల్లో జాప్యం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, పలువురు ప్రజా ప్రతినిధులు కోరారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ మండలంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తామని అన్నారు. ఈ సమావేశంలో తహసీల్దార్ స్వాతిబిందు, జడ్పీటీసీ భూక్యా కళావతి, సొసైటీ చైర్మన్ బిక్షం, వైస్ ఎంపీపీ గాదె నిర్మల తదితరులు పాల్గొన్నారు.



ఎక్సైజ్ ఎస్ఐ విజేందర్‌ను ప్రశ్నిస్తున్న ఎంపీటీసీ సతీష్‌కుమార్

'లింగన్న వర్ధంతిని జయప్రదం చేయాలి'

గుండాల, జూలై 27: ఈ నెల 31న రోళ్లగడ్డ గ్రామంలో నిర్వహించనున్న అజ్ఞాత దళనేత, న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు పూనెం లింగన్న 5వ వర్ధంతిని జయప్రదం చేయాలని న్యూడెమోక్రసీ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి గౌని నాగేశ్వరరావు, ఇల్లందు డివిజన్ కార్యదర్శి తుపాకుల నాగేశ్వరరావు కోరారు. మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ. ఏజన్సీలోని నిరుపేదల పక్షాన కూడు,గూడు, పోడుభూముల సాధనకై లింగన్న అనేక పోరాటాలు చేశారని పేర్కొన్నారు. గుండాల మం డలంలోని ఖనిజ సందను కొల్లగొట్టేందుకు ప్రభుత్వాలు చేస్తున్న కుట్రలను తి ప్పి కొట్టేందుకు ప్రజలను చైతన్య పరిచి ఉద్యమాలు చేశారని, ఈ క్రమంలోనే రోళ్లగడ్డ వద్ద పోలీసులు పట్టుకొని ఎన్‌కౌంటర్ చేశారని అన్నారు.

'అక్రమ రవాణాదారుల పట్ల అప్రమత్తంగా ఉండాలి'

టేకులపల్లి, జూలై 27: మానవ అక్రమ రవాణా చేసేవారి పట్ల నిరంతరం అప్రమత్తంగా ఉండాలని టేకులపల్లి సీఐ తాటిపాముల సురేష్ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా యాక్షన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్(ఏఐడీ) సంస్థ ఆధ్వర్యంలో శనివారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన అవగాహణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మానవ అక్రమ రవాణా మారుమూల గ్రామస్థాయిలో కూడ పెరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా మహిళలు, బాలికలను ప్రధాన లక్ష్యంగా చేసుకొని వివిధ రూపాల్లో అక్రమ రవాణా చేయడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. ఫేస్‌బుక్, ఇంస్టాగ్రామ్, ట్విట్టర్‌లలో మన వ్యక్తిగత వివరాలను పొందుపరచవద్దని, అలా పొందుపరచినట్టయితే అక్రమ రవాణా దారులకు మనం అవకాశం కల్పించినట్టేనన్నారు. ప్రతి ఒక్కరూ నిరంతరం అప్రమత్తంగా ఉంటూ అనుమానస్పద వ్యక్తుల పట్ల దగ్గరలోని పోలీసు స్టేషన్‌కు సమాచారం అందించాలని లేదా 100కు, 1098నెంబర్లకు ఫోన్‌చేసి తెలపాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం శ్రీనివాస్, ఏఎస్ఐ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టేకులపల్లి సీఐ సురేష్

'వృత్తి విద్యకు ప్రాధాన్యమివ్వాలి'


సర్టిఫికెట్లు అందజేస్తున్న అధికారులు

లక్ష్మిదేవిపల్లి, జూలై 27: నిత్యం జీవితంలో ఉపయోగపడే వృత్తులపై విద్యార్థుల్లో అవగాహన కలిగించాలని ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ ఎస్.మాధవరావు కోరారు. శనివారం కొత్తగూడెంలోని సింగరేణి ఉన్నత పాఠశాలలో నేషనల్ గ్రీన్ కార్ప్ (ఎన్‌జీసీ)కు చెందిన 54 పాఠశాలలకు సంబంధించిన 163 మంది విద్యార్థులకు ఎల్ఈడీ బల్బుల తయారీపై వర్క్‌షాపు నిర్వహించారు. జిల్లా సైన్స్ ఆఫీసర్ ఎస్.చలపతిరాజు ఆధ్వర్యంలో ఈ వర్క్‌షాపు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన ఏసీఈ మాధవరావు, ఎస్ఎస్ఏ ఫైనాన్స్ ఆఫీసర్ పి. శ్రీనివాస్ హాజరై వృత్తి విద్యాకోర్సులను వివరించారు. జిల్లాసైన్స్ ఆఫీసర్ చలపతిరాజు, రాష్ట్ర ఎన్‌జీసీ సహాయకులు రాజశేఖర్ వృత్తులు, నిత్యజీవితంలో తక్కువ పెట్టుబడులతో నిర్వహించే పనులపై వివరించారు.

మహా సభను జయప్రదం చేయండి

జూలూరుపాడు, జూలై 27: ఏఐటీయూసీ జూలూరుపాడు మండల మహా సభ ఈ నెల 29వ తేదీన జూలూరుపాడులోని ఏవిఆర్ ఫంక్షన్ హాల్లో నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం మండల సహాయ కార్యదర్శి పత్తిపాటి మహేష్ తెలిపారు. శనివారం జూలూరుపాడులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని మహా సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. హక్కుల సాధనకై కార్మికులు ఐక్యంగా ఉద్యమించాలని అన్నారు. ఈ సమావేశంలో ఏఐటియుసి నాయకులు గార్లపాటి వీరభద్రం, శివకృష్ణ, రామారావు, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

'సకుర'కు కేజీబీవీ విద్యార్థిని ఎంపిక

లక్ష్మిదేవిపల్లి, జూలై 27: సకుర కార్యక్రమంలో భాగంగా జపాన్‌లో జరిగే అంతర్జాతీయ వైజ్ఞానిక పోటీల్లో పాల్గొనే విద్యార్థుల ఎంపికలో భాగంగా జిల్లా స్థాయిలో నిర్వహించిన సకుర పోటీల్లో అన్నపురెడ్డిపల్లి కేజీబీవీ పాఠశాల విద్యార్థిని పి. వైష్ణవి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. శనివారం కొత్తగూడెంలోని సింగరేణి ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి సకుర పోటీలు నిర్వహించినట్లు జిల్లా సైన్స్ ఆఫీసర్ ఎస్. చలపతి రాజు తెలిపారు. రాష్ట్రస్థాయిలో మొత్తం 33 జిల్లాల నుంచి 33మంది విద్యార్థుల ఎంపిక చేశారు. వీరికి రాష్ట్రస్థాయిలో పోటీలు నిర్వహించి, ఐదుగురు విద్యార్థులను జపాన్ దేశంలో జరిగే కార్యక్రమానికి ఎంపిక చేస్తారని ఆయన తెలిపారు. ఈ పరీక్ష పర్యావేక్షులుగా జిల్లా పరీక్షల సహాయ కమిషనర్ ఎస్. మాధవరావు, ఎస్ఎస్ఏ అధికారి ఎస్.శ్రీనివాస్ వ్యవహరించగా, చుంచుపల్లి ఆంగ్ల ఉపాధ్యాయులు తబితారాణి విద్యార్థులను ఇంటర్వ్యూ చేశారు.

'రాయల సేవలు వెలకట్టలేనివి'

చుంచుపల్లి, జూలై 27: కొవ్వూరు రైల్వే లైన్ సాధన కమిటీ సభ్యులు రాయల చంద్రశేఖర్ చేసిన త్యాగాలు, సేవలు వెలకట్టలేనివని రైల్వేలైన్ సాధన కమిటీ కన్వీనర్ కొదమసింహం పాండురంగాచార్యులు అన్నారు. శనివారం ఎస్‌సీబీ నగర్‌లో 40 మందికి వంట సామాగ్రి తదితర వస్తువులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వే లైన్ మంజూరి కావడంలో రాయల చేసిన పోరాటాలు ప్రతి ఒక్కరికి స్ఫూర్తిగా నిలుస్తాయని కొనియాడారు. రాయల పోరాటాల స్ఫూర్తితో మనందరమూ ముందుకు సాగాలని అన్నారు. ఆయన పోరాటం ఎనలేనిదన్నారు. అనంతరం 20 మంది పురుషులకు దుప్పట్లను, 20 మంది మహిళలకు చీరెలను, వారం పాటు సరిపడా నిత్యవసర వస్తువులను అందజేశారు.

ఆర్టీసీలో బ్రీత్ అనలైజర్ మార్చాలి: సీఐటీయూ

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, జూలై 27: ఆర్టీసీలో బ్రీత్ అనలైజర్‌ను తక్షణమే మార్చాలని కొత్తగూడెం డీఎం దేవేందర్‌గౌడ్‌కు సీఐటీయూ నాయకులు శనివారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ పట్టణ కన్వీనర్ కన్వీనర్ డి.వీరన్న, అద్దె బస్సుల గౌరవ అధ్యక్షులు భూక్యా రమేష్‌లు మాట్లాడుతూ ప్రతీ రోజు ఎలాంటి ఆల్కాహాల్ సేవించకపోయినా ఆల్కాహాల్ టెస్టింగ్ మిషన్ తప్పుడు రిపోర్ట్ వస్తున్నాయని గుర్తు చేశారు. దీంతో ఆర్టీసీలో పని చేస్తున్న పర్మినెంట్ డ్రైవర్లకు అద్దె బస్సు డ్రైవర్లకు డ్యూటీలు ఇవ్వకుండా సస్పెండ్ చేస్తూ వారికి పని ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పనికి రాని మిషన్‌లను వెంటనే మార్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు లిక్కి బాలరాజు, కత్తి నరసింహారావు, సైదులు, శివ, జోజి, సాధిక్‌పాషా తదితరులు పాల్గొన్నారు.


వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

'డైనింగ్ హాళ్లు నిర్మించాలి'

ఇల్లెందు టౌన్, జూలై 27: ఐటీడీఏ ఆశ్రమ పాఠశాలలకు డైనింగ్ హాళ్ల నిర్మాణం చేయాలని ఎఐఎస్‌ఫ్ రాష్ట్ర సమితి సభ్యుడు ఉమ్మగాని హరీష్ గౌడ్ డిమాండ్ చేశారు. శనివారం డైనింగ్ హాలు నిర్మాణం చేయాలని డిమాండ్ చేస్తూ ఇల్లెందు ఎటీడీఎ రాధమ్మకు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ, మండల పరిధిలోని ఆశ్రమ పాఠశాలలో డైనింగ్ హాలు సదుపాయం లేక విద్యార్థులు వర్షంలోనే భోజనం చేస్తున్నారని, కొన్ని హాస్టళ్లలో తినేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంతోకాలం నుంచి డైనింగ్ హాళ్లను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నప్పటికి అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైన విద్యార్థుల సమస్యలను గుర్తించి తక్షణమే డైనింగ్ హాళ్లను నిర్మాణం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.